RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్ : పి. సైదులు, సంపుటి : 02 సంచిక : 360 శనివారం 22-11-2025 పేజీలు : 8

## రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ మరింత కఠినతరం చేయండి: పొన్నం ప్రభాకర్



రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి, మరణాల రేటును నివారించే విధంగా అధికారులు పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఇందుకోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ వేగవంతం చేయడానికి ఇటీవల రవాణా శాఖలో 33 జిల్లా స్థాయి బృందాలు, మూడు రాష్ట్రస్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసింది. ఇందులో డీటీసీ, ఆర్టీఏ ఇతర అధికారులు నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. ఏ బృందం ఎక్కడ తనిఖీలు చేపడుతుంది అనే దానిపై ముందస్తు సమాచారం లేకుండా ప్రతి రోజు ఉదయం 6 గంటలకి ఆయా బృందాలకు సమాచారం అందించి తనిఖీలు చేపట్టింది. గత 10 రోజుల వ్యవధిలో తనిఖీలు చేపట్టడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 4,748 కేసులు నమోదు చేశారు. మొత్తం 3,420 వాహనాలు సీజ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్‌బృందాలు మరింత తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

# హైదరాబాద్ అడ్డాగా ఉగ్రకుట్రకు ప్లాన్

ఐసిస్ ఉగ్రవాదుల భారీ 'ఉగ్ర' కుట్ర బట్టబయలైంది. హరిద్వార్(ఉత్తరాఖండ్), ఢిల్లీ, లఖ్‌నవూ(యూపీ), అహ్మదాబాద్ (గుజరాత్), ముంబయి, కోల్‌కతా సహా ప్రధాన నగరాల్లో ప్రాణాంతక రసాయనాలతో ఉగ్రదాడులకు పథక రచన జరిగిందని గుజరాత్ ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్) గుర్తించింది. ఐసిస్‌తో లింకులున్న అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్, ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహైల్ సలీం ఖాన్‌లను కొన్ని రోజుల క్రితం అహ్మదాబాద్‌లో అరెస్టు చేసి ఇంటరాగేట్ చేయగా ఈ వివరాలు వెలుగుచూశాయి. వీరిలో ప్రధాన నిందితుడు అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ తెలంగాణలోని హైదరాబాద్ వాస్తవ్యుడే. ఉగ్రదాడులకు పథక రచన చేయడంలో ఇతడిది కీలక పాత్ర అని గుజరాత్ ఏటీఎస్ అనుమానిస్తోంది. అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ ఒక డాక్టర్. అతడు చైనాలో ఎంబీబీఎస్ చేశాడు.

- హైదరాబాదీ వైద్యుడే ప్రధాన సూత్రధారి
- ఉగ్రదాడులకు హైదరాబాదీ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ పథక రచన
- యూపీకి చెందిన ఆజాద్ సులేమాన్, మహ్మద్ సుహైల్‌లతో కలిసి ప్లాన్
- ఆయుధాలను తరలిస్తుండగా అహ్మదాబాద్‌లో ముగ్గురి అరెస్ట్- ఐసిస్, ఐఎస్‌కేపీ ఉగ్రవాద సంస్థలతో లింకులు
- అహ్మదాబాద్‌లో మూడు కీలక అరెస్టులు
- పాక్ నుంచి రాజస్థాన్‌కు డ్రోన్‌లో ఆయుధాలు





**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని రాజేంద్ర నగర్‌లో ఉన్న ఫోర్ట్‌వ్యూ కాలనీలోని అసద్ మన్‌జిల్‌లో నివసిస్తున్నాడు. ఎంబీబీఎస్ చేసినా అహ్మద్ ఇంట్లోనే ఒంటరిగా ఉండేవాడని గుర్తించారు. అతడి ప్రవర్తన వింతగా ఉండేదని దర్యాప్తులో తేలింది. అహ్మద్ వివిధ కెమికల్స్ కోసం ఆన్‌లైన్‌లో పదేపదే ఆర్డర్లు ఇచ్చాడని గుజరాత్ ఏటీఎస్ పోలీసులు తేల్చారు. తన ఇంటిలోని ఓ గదిలో రసాయనాలు, ఆముదం నూనె (రైజిన్)తో రహస్య ప్రయోగాలు చేస్తుండేవాడని నిర్ధరించారు. దీంతో అనుమానం వచ్చి కుటుంబీకులు పలుమార్లు ప్రశ్నించగా, కమర్షియల్ అవసరాలకు వినియోగించే ఒక కెమికల్‌ను తయారు చేస్తున్నానని అహ్మద్ బదులిచ్చాడు. ఎన్‌క్రిప్టెడ్ యాప్స్, సోషల్ మీడియా

మిగతా 2లో



## నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ సర్కార్ చేయదు : కేటీఆర్

- ఫార్ములా-ఈ కార్ కేసుపై స్పందించిన కేటీఆర్
- సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు
- తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం

**హైదరాబాద్ :** ఫార్ములా-ఈ కార్ కేసులో గవర్నర్ అనుమతిపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఫార్ములా-ఈ కార్ కేసుపై ఇప్పటికే 100 సార్లు చెప్పాను ఏ తప్పు చేయలేదు, లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమేనని చెప్పారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఫార్ములా-ఈ కార్ కేసులో ఏమీ లేదన్న విషయం అందరికీ తెలుసునని చెప్పారు. నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరని, అందుకే దానం నాగేందర్‌తో రాజీనామా చేయిస్తారన్నారు. దానంతో రాజీనామా చేయిస్తామని మా వాళ్లతో అన్నారని తెలిపారు. అనర్హత వేటు పడితే పరువు పోతోందని రాజీనామాకు అవకాశం ఇస్తున్నారని పేర్కొన్నారు. సాంకేతికత సాకులతో కడియం శ్రీహరిని కాపాడే అవకాశం ఉందేమోనని చూస్తున్నారని చెప్పారు. "చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఫార్ములా-ఈ కార్ కేసులో ఏమీ లేదన్న విషయం అందరికీ తెలుసు. నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరు. దానం నాగేందర్‌తో రాజీనామా చేయిస్తారు. దానంతో రాజీనామా చేయిస్తామని మా వాళ్లతో అన్నారు. అనర్హత వేటు పడితే పరువు పోతోందని

మిగతా 2లో



## నెహ్రూ రచనలు దేశానికి దిక్సూచి లాంటివి

- రాహుల్ గాంధీ

- నెహ్రూ రచనలను డిజిటల్‌గా మార్చడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం

**ఢిల్లీ :** భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ రచనలను డిజిటల్‌గా మార్చడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. నెహ్రూ రచనలు దేశానికి శక్తిమంతమైన దిక్సూచి లాంటివని అభిప్రాయపడ్డారు. భారత దేశ ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకునేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాని తెలిపారు. నెహ్రూ రచనలు కేవలం చారిత్రక రికార్డులు మాత్రమే కాదని, దేశం ధైర్యం, సందేహాలు, ఆకాంక్షలను సంగ్రహించే మనస్సాక్షిని ప్రతిబింబిస్తాయని వెల్లడించారు. ఆధునిక భారతదేశాన్ని రూపొందించడంలో ఆయనకు ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాల గురించి లోతైన విశ్లేషణను అందిస్తాయని పేర్కొన్నారు. "నెహ్రూ రచనలు కేవలం చరిత్ర మాత్రమే కాదు. అవి భారతదేశం పరిణతి చెందుతున్న మనస్సాక్షికి నిదర్శనం. ముఖ్యంగా మన దేశ ప్రజాస్వామ్య ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలనుకునేవారికి దాని ధైర్యం, సందేహాలు, కలలు తెలుసుకునేందుకు నెహ్రూ మాటలు శక్తివంతమైన దిక్సూచిగా మిగిలిపోయాయి. ఈ వారసత్వం ఇప్పుడు బహిరంగంగా, అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంచినందుకు సంతోషం. భవిష్యత్తులో దీనిని ఇంకా విస్తరించాలని ఆశిస్తున్నాను.


**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత**

నెహ్రూ మేధో, రాజకీయ వారసత్వం ఇప్పుడు పరిమితులు

మిగతా 2లో

## రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- రాచకొండ క్రైమ్స్ డీసీపీగా గుణశేఖర్
- రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు
- 32 మందికి స్థానచలనం కల్పించిన సర్కార్




**హైదరాబాద్ :** రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. 32 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను అదనపు డీజీ పర్సనల్‌గా బదిలీ చేశారు. పరిమళ హనా నూతన్ జేకబ్‌ను సీఐడీ డీఐజీ, పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన మైలబత్తుల, మహేశ్వరం డీసీపీగా నారాయణ రెడ్డి, నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా పద్మజ, నాగర్ కర్నూల్ ఎస్పీగా పాటిల్ సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ దక్షిణ మండలం డీసీపీగా కిరణ్

మిగతా 2లో

## దుబాయ్ ఎయిర్ షోలో కూలిన భారత యుద్ధ విమానం 'తేజస్'- పైలట్ మృతి

- విమాన ప్రదర్శన సమయంలో కూలిన తేజస్ యుద్ధ విమానం- కూలిన వెంటనే మంటలు వ్యాపించి దగ్ధమైన విమానం



దుబాయ్ ఎయిర్ షోలో భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కుప్పకూలింది. విమాన ప్రదర్శన సమయంలో ఈ ఫైటర్ జెట్ ఎత్తు తగ్గుతూ కిందకు వస్తున్నట్టు అనిపించింది. అయితే వేగంగా వెళ్లి ఒక్కసారిగా నేలను తాకింది. కొన్ని క్షణాల వ్యవధిలో మంటలు చెలరేగి ఫైటర్ జెట్ పూర్తిగా దగ్ధమైంది. ఘటనాస్థలంలో భారీగా పొగలు అలుముకున్నాయి. తీవ్ర

మిగతా 2లో



2లో

## ఇంత జరుగుతున్నా సబిత ఇంద్రారెడ్డి స్పందించకపోవడం దారుణం: కవిత

- మహేశ్వరంలో సబిత అనుచరులు చెరువులను కబ్జా చేస్తున్నారని ఆరోపణ
- కబ్జాలపై సబిత స్పందించకపోవడం దారుణమన్న కవిత
- హైడ్రా కూడా కబ్జాలను పట్టించుకోవడం లేదని ఆరోపణ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసిందని వ్యాఖ్య

## ఉద్యోగుల కోసం కేంద్రం కొత్త లేబర్ కోడ్‌లు...

- అమల్లోకి వచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు
- కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏడాదికే గ్రాట్యుటీ పొందే అవకాశం
- ఐటీ ఉద్యోగులకు ప్రతినెలా 7వ తేదీలోపు జీతాలు తప్పనిసరి
- గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు తొలిసారిగా సామాజిక భద్రత కల్పన



2



2

## నీతీశ్ కేబినెట్‌లో అవినీతి, క్రిమినల్స్‌కు చోటు- నా సంపాదనలో 90 శాతం పార్టీకే : ప్రశాంత్ కిశోర్

- జనవరి 15 నుంచి బిహార్ నవనిర్మాణ్ సంకల్ప్ యాత్రను చేపట్టనున్నట్లు ప్రకటన

## ఫుల్‌టైమ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే'- స్పష్టం చేసిన డీకే శివకుమార్

- ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యే
- సీఎం మార్పుపై ప్రచారానికి తెరవేసిన డీకే శివకుమార్



2

# హైదరాబాద్ అడ్డాగా ఉగ్రకుట్రకు ప్లాన్

యాప్స్ ద్వారా అతివాద గ్రూపులు, ఐసిస్ ఉగ్రవాదులతో అతడు టచ్‌లో ఉండేవాడని గుర్తించారు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబయి నగరాలకు అహ్మద్ వెళ్లొచ్చాడు. ఉగ్రదాడుల కోసం అక్కడ రెక్కీ నిర్వహించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. తాజాగా నవంబరు మొదటి వారంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ వెళ్లాడు. నగరంలోని గ్రాండ్ యాంబియెన్స్ హోటల్‌కు చేరుకున్నాడు. దీనిపై వెంటనే నిఘా వర్గాల నుంచి గుజరాత్ ఏటీఎస్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో అహ్మద్‌ను అరెస్టు చేశారు. నవంబరు 7న గాంధీనగర్ జిల్లాలోని కలోల్ పట్టణంలో ఉన్న ఓ శ్మశాన వాటిక వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అహ్మద్ ప్రయాణిస్తున్న సిల్వర్ ఫోర్డ్ ఫిగో కారులో ఒక బ్యాగు దొరికింది. అందులో 2 గ్లోక్ పిస్టల్స్, 1 బెరెట్టా పిస్టల్, 30 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, 4 లీటర్ల ఆముదం నూనె ఉన్నాయి. అహ్మద్‌కు ఈ ఆయుధాలను అందించిన ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహైల్ మహ్మద్ సలీంలను అదే రోజున గుజరాత్‌లోని బనస్‌కాంత పట్టణంలో అరెస్టు చేశారు. ఆజాద్, మహ్మద్ సుహైల్‌లు ఉత్తరప్రదేశ్ వాస్తవ్యులు. అరెస్టయ్యే సమయానికి వీరిద్దరి వద్ద కూడా ఆయుధాలు, రసాయనాలు లభ్యమయ్యాయి.

గత ఏడాది కాలంగా ఈ ముగ్గురు నిందితుల కదలికలను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు ట్రాక్ చేస్తుండటం గమనార్హం. నవంబరు 7న గ్రాండ్ యాంబియెన్స్ హోటల్‌లో అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ తిరుగుతున్న వీడియో ఫుటేజీ పోలీసులకు దొరికింది. మరో నిందితుడు మహ్మద్ సుహైల్ మహ్మద్ సలీం ఇంట్లో ఐసిస్ జెండా, డిజిటల్ ఎవిడెన్సులు లభించాయి.

ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహైల్ మహ్మద్ సలీంలను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు విచారించగా ముఖ్యమైన విషయాలు చెప్పారు. రాజస్థాన్‌లోని హనుమాన్‌ఘర్ నుంచి ఈ ఆయుధాలను పొందామని నిందితులు వెల్లడించారు. పాకిస్థాన్ బార్డర్ మీదుగా ఒక డ్రోన్‌లో ఈ ఆయుధాలు హనుమాన్‌ఘర్‌కు చేరాయన్నారు. ఈ ఆయుధాల సప్లై కోసం పాకిస్థాన్‌లోని పలువురు హ్యాండ్లర్లతో హైదరాబాద్‌కు చెందిన అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ నిత్యం టచ్‌లో ఉండేవాడని దర్యాప్తులో వెల్లడైంది. ఆజాద్ సులేమాన్, మహ్మద్ సుహైల్, అహ్మద్ మొహియుద్దీన్‌లు ఈ ఆయుధాల కోసమే నవంబరు మొదటి వారంలో గుజరాత్‌కు వచ్చారని విచారణలో గుర్తించారు. ఆముదం నూనెతో ప్రాణాంతక రసాయన ఆయుధాల తయారీకి అహ్మద్ ప్రయోగాలు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. గుజరాత్ ఏటీఎస్ పోలీసుల విచారణలో అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ కీలక వివరాలు వెల్లడించాడు. ఇస్లామిక్ స్టేట్ ఖొరాసాన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ) అనే ఉగ్రవాద సంస్థతో తనకు లింకులు ఉన్నట్లు అతడు తెలిపాడు. ఆఫ్ఘనిస్థాన్‌లో ఉండే అబూ ఖదీజా అనే ఐఎస్‌కేపీ ఉగ్రవాది పర్యవేక్షణలో అహ్మద్ ఉగ్రదాడులకు ప్లానింగ్ చేస్తున్నట్లు గుర్తించామని గుజరాత్ ఏటీఎస్ డీఎస్పీ ఎస్ఎల్ చౌదరి తెలిపారు. నిందితుల ఇళ్లు, వారితో సంబంధమున్న నివాసాల్లో తనిఖీల కోసం 4 వేర్వేరు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిందితుల ఫోన్లలోని ఫొటోలు, వీడియోలపై దర్యాప్తు చేసేందుకు ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ సాయం తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఈ కేసు వివరాలను హైదరాబాద్ పోలీసులకు కూడా అందించామని గుజరాత్ ఏటీఎస్ డీఎస్పీ ఎస్ఎల్ చౌదరి చెప్పారు. అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్‌తో ఉగ్ర లింకులున్న వారిని గుర్తించడంపై ఫోకస్ పెట్టామన్నారు. ప్రస్తుతం అహ్మద్ కాల్ డీటెయిల్ రికార్డ్ (సీడీఆర్)లతో పాటు లోకల్ కాంటాక్ట్‌లను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆముదం నూనెతో రసాయన దాడులకు పథక రచన చేసిన వ్యవహారంపైనా అహ్మద్ నుంచి పూర్తి చిట్టాను సేకరిస్తామన్నారు. సోమవారం రోజు (నవంబరు 24న) హైదరాబాద్‌లోని అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ నివాసాలు, సంబంధీకుల ఇళ్లలో రైడ్స్ జరిగే అవకాశాలు ఉన్నాయి. కొన్ని నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో ఉగ్ర కుట్ర వెలుగుచూసిన నేపథ్యంలో, తాజాగా వెలుగుచూసిన ఈ వ్యవహారం కలకలం రేపింది. ప్రస్తుతం విజయనగరం ఉగ్ర కుట్ర వ్యవహారాన్ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారిస్తోంది. ఉగ్రవాదులతో లింకులు ఉన్నాయనే అభియోగాలతో సికింద్రాబాద్‌లోని లాలాగూడకు చెందిన సమీర్‌ను అరెస్టు చేశారు.

ఈ ఏడాది జులై 23న 'అల్ ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్ కాంటినెంట్' (ఏక్యూఐఎస్) ఉగ్రవాద సంస్థతో లింకులున్న ఐదుగురిని గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. వీరిలో సమా పర్వీన్ అనే 30 ఏళ్ల యువతి ఉంది. ఆమె బెంగళూరు వాస్తవ్యురాలు. అరెస్టయిన ఇతర నిందితుల్లో మహ్మద్ ఫైఖ్ (దిల్లీ), మహ్మద్ ఫర్దీన్ (అహ్మదాబాద్), సైఫుల్లా ఖురేషీ (నోయిడా), జీషాన్ అలీ (నోయిడా) ఉన్నారు. అంతకుముందు అరెస్టయిన మరో ముగ్గురు వ్యక్తులు విచారణలో చెప్పిన సమాచారం ఆధారంగా, సమా పర్వీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# దుబాయ్ ఎయిర్ షోలో కూలిన భారత యుద్ధ విమానం 'తేజస్'- పైలట్ మృతి

గాయాలతో పైలట్ ప్రాణాలు కోల్పోయారు. పైలట్ మృతిని భారత వైమానిక దళం ధ్రువీకరించింది. భారత వాయుసేనలో వినియోగిస్తున్న తేలికపాటి యుద్ధ విమానం %ఎ.ూా.ా% తేజస్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటల 40 నిమిషాల సమయంలో ప్రదర్శన చేస్తూ కూలిపోయింది. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందారు. ఈ ఘటనపై భారత వైమానక దళం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పైలట్ కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణంపై విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపింది. "దుబాయ్ ఎయిర్‌షోలో తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో పైలట్‌కు తీవ్ర గాయాలై మృతిచెందడం దిగ్భ్రాంతికరం. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ కష్ట సమయంలో పైలట్ కుటుంబానికి అండగా ఉంటాం. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతాం."

– భారత వాయుసేన –

**ఆకాశాన్ని అలుముకున్న నల్లటి పొగ**

ఫైటర్ జెట్ కూలిన నేపథ్యంలో విన్యాసాలు జరుగుతున్న దుబాయ్ వరల్డ్ సెంట్రల్‌లోని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నల్లటి పొగ ఆకాశాన్ని అలుముకుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా సైరన్లు మోగాయి. యుద్ధ విమానం ఒక్కసారిగా కూలి మంటలు చెలరేగిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెగెటివ్ జీ-ఫోర్స్ టర్న్ నుంచి పైలట్ యుద్ధవిమానాన్ని వెనక్కి మళ్లించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రపంచంలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన అయిన దుబాయ్ ఎయిర్‌షోలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన విమానయాన సంస్థలు ఈ ఎయిర్‌షోలో పాల్గొని సందడి చేస్తాయి.

**భారీగా తేజస్ విమానాల కొనుగోళ్లకు ఆర్డర్లు**

తేజస్ యుద్ధ విమానం హిందుస్థాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్-లో తయారైంది. ఇది పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన 4.5వ తరం ఫైటర్‌జెట్. భారత్ తయారు చేసిన తొలితరం యుద్ధ విమానం తేజస్ ఎంకే 1.

భారీగా తేజస్ విమానాల కొనుగోళ్లకు ఇప్పటికే వైమానిక దళం ఆర్డర్లు ఇచ్చింది. 350కి పైగా తేజస్ విమానాలను ఇండక్ట్ చేసుకునేందుకు సిద్ధమైంది. గత అక్టోబర్‌లో 2 విమానాలను వైమానికదళానికి %నాూా% అందించింది.

**తేజస్ ప్రమాదానికి గురవడం ఇది రెండోసారి**

కాగా, ఈ యుద్ధ విమానాలు ప్రమాదానికి గురవడం ఇది రెండోసారి. అంతకుముందు ఈ ఏడాది మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తేజస్ ఫైటర్ జెట్ శిక్షణ సార్టీలో ఉండగా కూలిపోయింది. ఆ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డారు.

# నీతీశ్ కేబినెట్‌లో అవినీతి, క్రిమినల్స్‌కు చోటు- నా సంపాదనలో 90-శాతం పార్టీకే : ప్రశాంత్ కిశోర్

బిహార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మంత్రివర్గంపై జన్‌సూరజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ తీవ్ర ఆరోపణలు చేశారు. నీతీశ్ కుమార్ నేతృత్వంలోని కొత్త మంత్రివర్గం పూర్తిగా అవినీతి, క్రిమినల్ నేతలతో నిండిపోయిందని విమర్శించారు. ఇలాంటి నేతలను మంత్రివర్గంలో చేర్చడం ద్వారా ప్రధాని మోదీ, అమిత్ షా, నీతీశ్ కుమార్‌కు బిహార్ ప్రజల గురించి ఆలోచించట్లేదనే విషయం అర్థమవుతుందన్నారు. తమ పార్టీ ఆధ్వర్యంలో జనవరి 15 నుంచి బిహార్ నవనిర్మాణ్ సంకల్ప్ యాత్రను చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ యాత్రలో భాగంగా తనతో పాటు జన్‌సూరజ్ పార్టీ కార్యకర్తలు రాష్ట్రంలోని అన్ని ఇళ్లను సందర్శిస్తారని తెలిపారు. వెస్ట్ చంపారణ్‌లోని గాంధీ ఆశ్రమంలో చేపట్టిన ఒక రోజు మౌనవ్రతం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

"గురువారం ప్రమాణం చేసిన నీతీశ్ కుమార్ కొత్త మంత్రివర్గంలో మొత్తం అవినీతిపరులు, నేరస్థులే ఉన్నారు. ఈ కేబినెట్ నియామకం బిహార్ ప్రజలకు చెంపదెబ్బ లాంటిది. సుమారు కోటి మందికి పైగా మహిళల ఖాతాల్లో రూ.10వేలు వేసి ఓట్లను కొనుగోలు చేశారు. ఇప్పుడు బిహార్ ప్రజల గురించి ఆలోచించడం లేదు. ఈ నగదు బదిలీ పథకం కోసం ప్రపంచ బ్యాంక్ గ్రాంట్లతో పాటు రాష్ట్ర అత్యవసర నిధులను వాడుకున్నారు. నేను ఏదైనా తప్పుగా మాట్లాడితే రాష్ట్ర ప్రభుత్వం నన్ను జైలులో వేయవచ్చు. సుమారు 15-18 నెలల్లో రాష్ట్రంలోని అన్ని ఇళ్లకు తిరిగి ప్రభుత్వం దొంగ హామీలను ప్రజలకు వివరిస్తాం. ప్రచారానికి ముందే జన్‌సూరజ్ పార్టీ వ్యవస్థను బలోపేతం చేసుకుంటాం. వచ్చే 20 నెలలు ప్రతి రోజు ఒక బ్లాక్‌లో గడుపుతాను. బ్లాక్‌లోని మహిళలకు ఫామ్‌లు నింపించి ప్రభుత్వ అధికారులను కలిసి అందిస్తాను. బ్లాక్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పోరాడుతాం."

– ప్రశాంత్ కిశోర్, జన్‌సూరజ్ పార్టీ అధినేత

వచ్చే ఐదేళ్లపాటు తన ఆదాయంలో 90 శాతం సంపదను పార్టీ నిర్వహణకు దానం చేస్తానని తెలిపారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలైన సహనం, శాంతినే తాను కూడా నమ్ముతానని చెప్పారు. "నా ఆదాయంలో 90శాతం సంపదను పార్టీకి దానం చేస్తాను. ఇంకా దిల్లీలోని నా ఇల్లు మినహా గత 20 ఏళ్లలో నేను సంపాదించినదంతా పార్టీకే ఇస్తాను. ఇప్పుడు బిహార్ ప్రజలకు కూడా ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. పార్టీతో సంబంధం ఉన్నవారందరూ రూ. వెయ్యి విరాళంగా ఇవ్వాలని కోరుతున్నారు. పార్టీకి విరాళం ప్రకటించని వారితో చర్చించను. కనీసం కోటి మంది ఇచ్చినా 100కోట్ల నిధి అవుతుంది." అని ప్రశాంత్ కిశోర్ తెలిపారు.

అంతకుముందు బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా దక్కించుకోకుండా ఘోర పరాజయం పాలేది. దీంతో ఎన్నికల ఫలితాలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రశాంత్ కిశోర్ ఒకరోజు మౌనవ్రతం చేపట్టారు. పార్టీ పరాజయానికి 100 శాతం బాధ్యత తనదేనన్న ఆయన, తప్పిదాలను సరిదిద్దుకుని తిరిగి మరింత బలంగా వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదని చెప్పారు.

ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 243 సీట్లకు గాను 202 సీట్లు దక్కించుకొని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. నీతీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీఏ కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. గురువారం పట్నాలోని గాంధీ మైదానంలో నీతీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు.

# ఫుల్‌టైమ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే'- స్పష్టం చేసిన డీకే శివకుమార్

కర్ణాటక కాంగ్రెస్ సర్కార్‌లో 'ముఖ్యమంత్రి' మార్పు ఉంటుందనే ప్రచారానికి ఎట్టకేలకు కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ తెరదించారు. ఐదేళ్లు సిద్ధరామయ్యే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆయన స్పష్టం చేశారు. తామంతా అందుకు సహకరిస్తామని పేర్కొంటూ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు.

"మొత్తం 140 మంది శాసన సభ్యులు నా వాళ్లే. గ్రూప్‌లు కట్టడం అనేది నా రక్తంలో లేదు. ముఖ్యమంత్రి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి ఒక్కరూ తాము మంత్రి కావాలని కోరుకుంటారు. అందుకే దిల్లీలోని హైకమాండ్‌తో వారు సమావేశం అయ్యారు. అది వారి హక్కు. ఇది సహజంగా జరిగేదే. అధిష్ఠానం వద్దకు వెళ్లవద్దని ఎవరినీ ఆపలేం కదా! ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పారు. ఆయనతో మేము కలిసి పనిచేస్తాం. హైకమాండ్ ఆదేశాలకు మేము కట్టుబడి ఉంటాం."

– డీకే శివకుమార్, కర్ణాటక కాంగ్రెస్ నేత

**డీకే ఆశలు గల్లంతు!**

వాస్తవానికి డీకే శివకుమార్ శిబిరం చాలా కాలంగా నాయకత్వ మార్పు కోసం పార్టీ హైకమాండ్‌పై ఒత్తిడి పెంచుతూ వచ్చింది. మరోవైపు సిద్ధరామయ్య తానే సీఎంగా కొనసాగుతానని చెబుతూ వచ్చారు. దీనితో పార్టీలోనే అంతర్గతంగా రెండు వర్గాల మధ్య అధికార పోరాటం జరిగింది. ఇటీవల మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో శివకుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ కర్ణాటక చీఫ్ పదవిలో శాశ్వతంగా ఉండలేనని వ్యాఖ్యానించారు. అంతేకాదు తన ప్రసంగానికి సంబంధించిన విషయాలతో డీకే ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. దీనికి 'ఎక్కడ కృషి ఉంటుందో, అక్కడే ఫలితం ఉంటుంది. భక్తి ఎక్కడుంటే, భగవంతుడు అక్కడుంటాడు' అని రాశారు. కానీ చివరికి హైకమాండ్ ఆదేశాల మేరకు డీకే వెనక్కు తగ్గి, ఐదేళ్లు సిద్ధరామయ్యే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని చెప్పి, ఈ తతంగానికి ఒక ముంగిపు ఇచ్చారు.

**ఇకపైనా నేనే సీఎం..** ఇంతకు ముందు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, భవిష్యత్‌లో రాష్ట్ర బడ్జెట్‌లను కూడా ప్రవేశపెడతానని పేర్కొన్నారు. డికే శివకుమార్‌ను తదుపరి ముఖ్యమంత్రిగా చేయాలని పార్టీ నాయకత్వంపై ఒత్తిడి చేయడానికి కనీసం 15 మంది ఎమ్మెల్యేలు, డజను మంది ఎంఎల్సీలు దిల్లీలో మకాం వేసిన నేపథ్యంలో సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఒప్పందాన్ని తుంగలో తొక్కారు!**

2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన తరువాత ముఖ్యమంత్రి పీఠం గురించి ఓ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, సిద్ధరామయ్య రెండున్నర సంవత్సరాలు (అంటే ఈ నవంబర్ 20 వరకు) సీఎంగా ఉండాలి. ఆ తరువాత శివకుమార్ సీఎం పీఠాన్ని అధిరోహించాలి. కానీ ఇది జరగలేదు. దీనితో కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయం వేడెక్కింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మద్దతుదారులు దిల్లీకి వెళ్లడంతో ముఖ్యమంత్రి మార్పుపై ప్రచారం జోరుగా సాగింది. కానీ హైకమాండ్ మాత్రం సిద్ధరామయ్య వైపే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. అధికార పంపిణీ అంశాన్ని మొదటి నుంచి తోసిపుచ్చుతున్న సిద్ధరామయ్య, ఎమ్మెల్యేల్లో అత్యధికులు తనకే మద్దతుగా ఉన్నారని చెబుతూ వచ్చారు. అంతేకాదు దిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఇవ్వాలని వారిని కోరారు. క్యాబినెట్‌లో మార్పులు చేసి, అసంతృప్తులను బుజ్జగించవచ్చని సిద్ధరామయ్య చెప్పినట్లు తెలుస్తోంది. ఇందుకు హైకమాండ్ కూడా అంగీకరించినట్లు సమాచారం.

# ఉద్యోగుల కోసం కేంద్రం కొత్త లేబర్ కోడ్‌లు...

ప్రతి ఉద్యోగికి అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వడం ఇకపై తప్పనిసరి దేశంలోని కోట్లాది మంది ఉద్యోగుల సంక్షేమం, భద్రతను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న 29 పాత కార్మిక చట్టాలను ఏకీకృతం చేస్తూ రూపొందించిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను శుక్రవారం నుంచి అమలులోకి తీసుకొచ్చింది. వేజెస్ కోడ్, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్, ఆక్యుపేషనల్ సేఫ్టీ కోడ్ అనే ఈ నాలుగు సంస్కరణలు వ్యవస్థీకృత, అసంఘటిత రంగాల్లోని కార్మికులకు సమగ్రమైన రక్షణ కవచాన్ని అందించనున్నాయి. ఈ కొత్త నిబంధనలు ఉద్యోగ భద్రత, సకాలంలో వేతనాలు, సామాజిక భద్రత, మహిళల సాధికారత వంటి అంశాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**కార్మిక చట్టాల్లో సమూల సంస్కరణలు**

సంక్లిష్టంగా, బహుళ నిబంధనలతో ఉన్న 29 వేర్వేరు చట్టాల స్థానంలో కేవలం 4 కోడ్‌లను తీసుకురావడం ద్వారా ప్రభుత్వం కార్మిక చట్టాల వ్యవస్థను సరళీకృతం చేసింది. దీనివల్ల ఉద్యోగులకు తమ హక్కులపై స్పష్టత లభించడంతో పాటు, యాజమాన్యాలకు కూడా నిబంధనల పాటింపు (కాంప్లయన్స్) సులభతరం అవుతుంది. ముఖ్యంగా, ఇప్పటివరకు చట్టపరమైన గుర్తింపు లేని గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లను (ఓలా, ఉబర్, స్విగ్గీ వంటి యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేసేవారు) తొలిసారిగా చట్ట పరిధిలోకి తీసుకురావడం ఈ సంస్కరణల్లో కీలకమైన మైలురాయి.

**ఉద్యోగులకు లభించే కీలక ప్రయోజనాలు**

కొత్త లేబర్ కోడ్‌లు ఉద్యోగులకు అనేక ప్రత్యక్ష ప్రయోజనాలను అందిస్తున్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి:

అపాయింట్‌మెంట్ లెటర్ తప్పనిసరి: ఇకపై ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా నియామక పత్రం (అపాయింట్‌మెంట్ లెటర్) ఇవ్వాలి. ఇందులో ఉద్యోగ నిబంధనలు, వేతనం, పని గంటలు వంటి వివరాలు స్పష్టంగా పేర్కొనాలి. ఇది ఉద్యోగ భద్రతకు, పారదర్శకతకు భరోసా ఇస్తుంది. సకాలంలో వేతనాలు: ఐటీ రంగంలోని ఉద్యోగులకు ప్రతినెలా 7వ తేదీలోపు కచ్చితంగా జీతాలు చెల్లించాలి. ఇతర రంగాల్లోనూ వేతనాల చెల్లింపులో జాప్యాన్ని నివారించడానికి కఠిన నిబంధనలు చేర్చారు. పని గంటల నియంత్రణ: సాధారణంగా రోజుకు 8 నుంచి 12 గంటల పని, వారానికి 48 గంటలకు మించకుండా పనివేళలను నియంత్రించారు. అదనపు పని (ఓవర్‌టైమ్) చేయిస్తే రెట్టింపు వేతనం చెల్లించాల్సి ఉంటుంది. ఉచిత ఆరోగ్య పరీక్షలు: 40 ఏళ్లు పైబడిన ఉద్యోగులకు యాజమాన్యాలు ఏటా ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించడం తప్పనిసరి.

**గ్రాట్యుటీ నిబంధనల్లో కీలక మార్పు**

గతంలో ఒక సంస్థలో కనీసం ఐదేళ్లు నిరంతరాయంగా పనిచేస్తేనే ఉద్యోగులు గ్రాట్యుటీకి అర్హులు. అయితే కొత్త నిబంధనలు ఫిక్స్‌డ్-టర్మ్ ఎంప్లాయీస్ లేదా కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరటనిచ్చాయి. ఏడాదికే గ్రాట్యుటీ: ఇకపై ఫిక్స్‌డ్-టర్మ్ ఉద్యోగులు ఒక సంస్థలో కేవలం ఒక సంవత్సరం పనిచేసినా గ్రాట్యుటీ పొందేందుకు అర్హులవుతారు. దీనివల్ల తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సైతం పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా ప్రయోజనాలు అందుతాయి. గ్రాట్యుటీ లెక్కింపు: గ్రాట్యుటీని (చివరిగా తీసుకున్న వేతనం ఐ 15/26) ఐ పూర్తి చేసిన సేవా సంవత్సరాలు అనే ఫార్ములా ఆధారంగా లెక్కిస్తారు. ఒక ఉద్యోగి సేవలో ఉండగా మరణించినా లేదా వైకల్యానికి గురైనా కనీస సేవా కాలంతో సంబంధం లేకుండా గ్రాట్యుటీ చెల్లించాల్సి ఉంటుంది.

గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు చట్టపరమైన గుర్తింపు దేశంలో వేగంగా విస్తరిస్తున్న గిగ్ ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు కొత్త కోడ్‌లు చట్టపరమైన రక్షణ కల్పిస్తున్నాయి. సామాజిక భద్రత: ఉబర్, స్విగ్గీ వంటి అగ్రిగేటర్ సంస్థలు తమ వార్షిక టర్నోవర్‌లో 1 నుంచి 2 శాతం వరకు సామాజిక భద్రతా నిధికి జమ చేయాలి. ఈ నిధిని గిగ్ వర్కర్ల పీఎఫ్, ఈఎస్ఐసీ, బీమా వంటి అవసరాలకు వినియోగిస్తారు.

పోర్టబుల్ ప్రయోజనాలు: ఆధార్‌తో అనుసంధానించిన యూనివర్సల్ అకౌంట్ నంబర్ ద్వారా వలస కార్మికులు రాష్ట్రాలు మారినా తమ సామాజిక భద్రతా ప్రయోజనాలను కోల్పోకుండా కొనసాగించుకోవచ్చు. మహిళా ఉద్యోగులకు అదనపు భరోసా మహిళా సాధికారతకు, సమానత్వానికి కొత్త చట్టాలు పెద్దపీట వేశాయి. అన్ని రంగాల్లో అవకాశాలు: మహిళలు రాత్రి షిఫ్ట్‌లతో పాటు గనులు వంటి ప్రమాదకర పనుల్లో కూడా పనిచేసేందుకు అనుమతించారు.

# నెహ్రూ రచనలు దేశానికి దిక్సూచి లాంటివి : రాహుల్ గాంధీ

లేకుండా ప్రజలకు అందుబాటులో ఉందని రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. చారిత్రక, ప్రజాస్వామ్య అవగాహనను ప్రోత్సహించడంలో ఇది కీలక ముందడుగు అని తెలిపారు. దీంతోపాటు భారతదేశ సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఏర్పడటానికి మార్గనిర్దేశం చేసిన పునాది ఆలోచనలతో పౌరులు పరిశోధించడానికి ఉపయోగపడుతుందన్నారు.

**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే ఛాన్స్**

కొత్తగా ప్రారంభించిన డిజిటల్ ఆర్కైవ్‌లో జవహర్ లాల్ నెహ్రూ వ్యాసాలు, లేఖలు, ప్రసంగాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి పరిశోధకులు, విద్యార్థులు, పౌరులు అధ్యయనం చేసుకోవచ్చు. ప్రస్తుతం కొన్ని రచనలు మాత్రమే అందుబాటులో ఉన్నా, భవిష్యత్తులో పూర్తిగా డిజిటల్ చేయనున్నారు. స్మార్ట్ ఫోన్‌లో సైతం ఉపయోగించుకునేలా నెహ్రూ రచనలను 'జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్' డిజిటలైజ్ చేసినట్లు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ప్రకటించారు. http://nehruarchive.inలో నెహ్రూ రచనలు అందుబాటులో ఉంటాయని వివరించారు. 1903-1964 కాలానికి చెందిన 'జవహర్‌లాల్ నెహ్రూ ఎంపిక చేసిన రచనలు' 100 సంపుటాల ప్రచురించారు. వీటిని అందరూ ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోని సులభంగా అధ్యయనం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

**మరిన్ని పుస్తకాలను ఇందులో చేర్చుతాం : జైరాం రమేశ్**

"ముందుగా 75,000 పేజీలు, 3,000 కంటే ఎక్కువ అంశాలను డిజిటల్ చేశాం. ఇంకా మరిన్ని అంశాలు, ఛాయాచిత్రాలు, ఆడియో, చిత్రాలను కవర్ చేయడానికి ఆర్కైవ్ విస్తరిస్తూనే ఉంటాం. ఆర్కైవ్‌ను విస్తరించేందుకు ప్రపంచవ్యాప్తంగా నెహ్రూకు, ఆయన నుంచి వచ్చిన లేఖలను కలిగి ఉన్న వారిని సంప్రదిస్తున్నారు. నెహ్రూ జీవితకాలంలో రాసిన, ఆయన గురించి ఉన్న పుస్తకాలను ఇందులో చేర్చుతాం." అని జైరాం రమేశ్ అన్నారు.

# నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ సర్కార్ చేయదు : కేటీఆర్

రాజీనామాకు అవకాశం ఇస్తున్నారు. సాంకేతికత సాకులతో కడియం శ్రీహరిని కాపాడే అవకాశం ఉందేమోనని చూస్తున్నారు." – కేటీఆర్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు

**హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం :** ఈ క్రమంలో ప్రైవేటు పరిశ్రమల పెట్టుబడి కోసం వచ్చినప్పుడు రాయితీగా భూకేటాయింపు జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. ఉపాధి కోసం రాయితీలు ఇచ్చి భూకేటాయింపు జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోతోందని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో భారీగా భూకుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బాలానగర్, నాచారం, జీడిమెట్లలో భూ కుంభకోణం జరుగుతోందని వివరించారు.

9,300 ఎకరాల్లో భూ కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని కేటీఆర్ ఆరోపణలు చేశారు. రూ.5 లక్షల కోట్ల విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు కేబినెట్ భేటీలో తెరలేపిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుచరులకు, బంధువులకు ఇచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహించారు. హైదరాబాద్‌లో భూములు ఉన్న చోట రేవంత్‌రెడ్డి ముఠా వాలిపోతోందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఆలోచనలు మొత్తం భూములపైనే ఉంటాయని కేటీఆర్ తెలిపారు.

**పెరిగిన భూముల విలువలను ఏటీఎంగా మార్చారు :** మూసీ ప్రాజెక్టు, మెట్రోపై కుంభకోణాలకు తెరలేపిందని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హెచ్‌సీయూలో భూములపై కన్నేస్తే సుప్రీంకోర్టు ఆపిందని గుర్తు చేశారు. పెరిగిన భూముల విలువలను ఏటీఎంగా మార్చుకునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెరలేపిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

ఖరే నియమితులయ్యారు. ఎంబీఈఐటీ డీసీపీగా రూపేశ్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీశ్, ములుగు ఎస్పీగా సుధీర్, కుమురం భీం ఆసిఫాబాద్ ఎస్పీగా నితికా పంట్, టీఎస్ఎస్పీ ఆదిలాబాద్ రెండో బెటాలియన్ కమాండెంట్‌గా కాంతిలాల్ సుభాశ్, హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సిరిశెట్టి సంకేత్, మల్కాజిగిరి డీసీపీగా శ్రీధర్, వనపర్తి ఎస్పీగా సునీత తదితరులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఐడీ డీజీగా పరిమళా నూతన్
పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎం.చేతన
మహేశ్వరం డీసీపీగా నారాయణ్ రెడ్డి
నార్కోటిక్ ఎస్పీగా పద్మ
మల్కాజ్ గిరి డీసీపీగా శ్రీధర్
సౌత్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే
నాగర్ కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్
వికారాబాద్ ఎస్పీగా స్నేహ మెహ్రా
టాస్క్ ఫోర్స్ డీసీపీగా వైభవ్ గైక్వాడ్
ములుగు ఎస్పీగా సుధీర్
భుపాలపల్లి ఎస్పీగా సంకేత్
వనపర్తి ఎస్పీగా సునీత
ఎస్ఎం ఐటీ డీసీపీగా రూపేశ్
మహబూబాబాద్ ఎస్పీగా శబరీశ్
ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖితా పంత్
నార్కోటిక్ ఎస్పీగా గిరిధర్
మ్నులుగు ఎస్పీగా సుధీర్ రామ్‌నాథ్
భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్
గవర్నర్ ఏడీసీగా పి.సుభాశ్
పెద్దపల్లి రామగుండం డీసీపీగా బి.రామ్‌రెడ్డి
కొత్తగూడెం ఓఎస్డీగా అవినాశ్
ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్
భువనగిరి ఏఎస్పీగా రాహుల్ రెడ్డి
జగిత్యాల ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డి
ములుగు ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ
భైంసా ఎస్డీపీఓగా రాజేశ్ మీనా
ఆదిలాబాద్ ఏఎస్పీగా మౌనిక
ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్
నిర్మల్ ఏఎస్పీగా పి.సాయికిరణ్
వేములవాడ ఏఎస్పీగా రుత్విక్ సాయికొట్టె
సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర
టీజీ ట్రాన్స్ కో ఎస్పీగా శ్రీనివాస్
రాచకొండ క్రైమ్స్ డీసీపీగా గుణశేఖర్

# ఇంత జరుగుతున్నా సబిత ఇంద్రారెడ్డి స్పందించకపోవడం దారుణం: కవిత

మాజీ మంత్రి, మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో సబితా ఇంద్రారెడ్డి అనుచరులే చెరువులను కబ్జా చేస్తున్నారని ఆమె ఆరోపించారు. కబ్జాలపై ఆమె స్పందించకపోవడం దారుణమని కవిత విమర్శించారు.

హైడ్రా కూడా కబ్జాలను పట్టించుకోవడం లేదని ఆమె అన్నారు. మహేశ్వరంలోని రావిర్యాల, మంత్రాల చెరువులలో సబితా ఇంద్రారెడ్డి అనుచరులు కబ్జాలకు పాల్పడుతున్నారని, కానీ హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ఆమె నిలదీశారు.

మున్ముందు ఈ కబ్జాలకు సంబంధించి పూర్తి వివరాలను హైడ్రాకు సమర్పిస్తామని, వారు ఏం చర్యలు తీసుకుంటారో చూస్తామని అన్నారు. హైడ్రా ప్రత్యేకంగా సర్టిఫైడ్ ఏజెన్సీగా ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. కబ్జాలకు సంబంధించిన వివరాలను హైడ్రాకు ఇస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వెళతారేమోనని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు, ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తనకు తెలిసిందని ఆమె అన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు





**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 21 :** లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ రామ నరసయ్య చిన్న కుమారుడు సూర్యం మోహిత్ పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.
తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రోటీన్ పౌడర్, అన్నప్రసాద వితరణ, కంటయపాలెం జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో 15 మంది 10వ తరగతి విద్యార్థులకు రూ.6 వేల విలువగల ఆల్ ఇన్ వన్ పుస్తకాలు, రూ.16 వేలతో సౌండ్ సిస్టం, 7వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు,6వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు, అంగన్వాడి పిల్లలకు పలక బలపాలు, పెద్ద నాగారం పాఠశాలలో 20 మందికి రూ.8 వేలతో ఆల్ ఇన్ పుస్తకాలు, 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు, 6,7వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు పరీక్ష ప్యాడ్లు, దంతాలపల్లి గ్రామపంచాయతీ సిబ్బందులకు టవల్స్, అమాలి వర్కర్స్ లకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం లావణ్య మెడికల్ నిర్వాహకులు గోపాల్ తండ్రి మృతి చెందడంతో నేత్రాలను సేకరించారు.
ఈ కార్యక్రమంలో ఆర్ సి లయన్ దామెర సరేష్, జడ్ సి లు లయన్ చిదిరాల నవీన్ కుమార్, లయన్ డాక్టర్ కిరణ్ కుమార్, క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్, పాఠశాల హెచ్ఎం కె.ప్రభాకర్, ఉపాధ్యాయులు అశోక్, జనార్దన్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**- ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేందర్ రెడ్డి, ఎంఈఓ బుచ్చయ్య**



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 21 :** విద్యార్థి దశనుండే పిల్లలు శాస్త్రీయంగా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్యులు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రాజేందర్ రెడ్డి,తొర్రూరు మండల విద్యాశాఖాధికారి మహంకాళి బుచ్చయ్య లు అన్నారు.జనవిజ్ఞాన వేదిక తొర్రూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను స్థానిక జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని వివిధ ప్రభుత్వ, రెసిడెన్షియల్ మరియు ప్రైవేట్ పాఠశాల నుండి 21 టీంలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జెవివి మండల అధ్యక్షులు తాళ్ల పెల్లి రమేష్ గౌడ్ అధ్యక్షతన జిల్లా ఉపాధ్యక్షులు రాయి పెల్లి యాకయ్య సమన్వయంతో ప్రశ్నాపత్రాలను మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య ఆవిష్కరించారు. పాఠశాల హెచ్ఎం జెల్లా లక్ష్మీనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్ లు విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలని, ప్రతి ఒక్కరు చెకుముకి రాయి లాగా తారాజువ్వలను వెదజల్లి చీకటిని, అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం వైపు అడుగులు వేయాలని కోరారు.
ప్రభుత్వ విభాగంలో తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో కేజీబీవీ, ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానంలో టీఎస్ఎంఎస్ గుర్తూరు మోడల్ స్కూల్,ద్వితీయ స్థానంలో జడ్పిహెచ్ఎస్ మాటేడు విద్యార్థులు,రెసిడెన్షియల్ విభాగంలో ప్రథమ స్థానంలో సోషల్ వెల్ఫేర్ పాఠశాల, ద్వితీయ స్థానంలో ఎంజెపి పాఠశాల విద్యార్థులు, ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానంలో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్,ద్వితీయ స్థానంలో శ్రీనలంద హై స్కూల్ విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. ప్రథమ స్థానంలో గెలిచిన టీమ్ లు ఈనెల 28న జిల్లా స్థాయిలో మహబూబాబాద్ లో జరిగే చెకుముకి పోటీలలో పాల్గొనాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హరిపిరాల గెజెటెడ్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, తొర్రూరు పాఠశాల ,ఇన్చార్జి హెచ్ఎం బ్రహ్మానంద రెడ్డి,జెవివి జిల్లా ఉపాధ్యక్షులు కొండం వసుందర్, మండల ప్రధాన కార్యదర్శి కోటగిరి కుమార్, చెకుముకి కన్వీనర్ పులి ముత్తిలింగం, శ్రీధర్ రెడ్డి,కోశాధికారి ఎద్దు వెంకన్న, జెవివి బాధ్యులు జ్యోతి, రేణుకా దేవి, లింగమూర్తి బ్రహ్మానందరెడ్డి, సుధకారాచారి , ప్రేమలత,ఓంప్రకాష్,కిశోర్, మధు,లింగన్న,వెంకన్న, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మత్స్యకారుల దినోత్సవం వేడుకలు

**- జెండా ఆవిష్కరించిన ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య ముదిరాజ్**




**తొలిఅక్షరం గణపురం/ నవంబర్ 22:** గణపురం: ప్రపంచ మత్స్యకార దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇచ్చిన బీసీ–డీ వర్గం నుండి బీసీ-ఏ వర్గానికి చేర్చే హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ వర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాల పట్ల కృతజ్ఞతలు తెలిపిన ఆయన, చేప పిల్లల పంపిణీ 100 శాతం సబ్సిడీతో జరుగుతోందని అభినందించారు. అయితే ఇప్పటివరకు 50 శాతం మాత్రమే పంపిణీ జరిగిందని, మిగిలిన వాటిని కూడా త్వరగా మత్స్యకారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ చాడ కృష్ణస్వామి, మత్స్యశాఖ గణపురం డైరెక్టర్ గూళ్ళ రాజ కుమార్, ఆకుల తిరుపతి, బోళ్ల బాలకృష్ణ, సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జ్ జోడు ప్రదీప్ ముదిరాజ్, పల్లెబోయిన రవీందర్, బోళ్ళ గణేష్, జనగాం రమేష్, తేలు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- నేరేడుపల్లి, ప్రగతిసింగారం, వసంతాపూర్, కొప్పుల గ్రామాలల్లో వరి ధాన్యం కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**



**తొలి అక్షరం/ భూపాలపల్లి, మండలం, 21 నవంబర్:** భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలం నేరేడుపల్లి, ప్రగతి సింగారం, వసంతాపూర్ మరియు కొప్పుల గ్రామాలల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని రైతులను ఎమ్మెల్యే కోరారు. రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరపాలని సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, రైతులు ఉన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన పెద్దకోడెపాక గ్రామ రజక కులస్తులు..**

శుక్రవారం ఉదయం పెద్దకోడెపాక గ్రామ మడేలయ్య రజక సంఘం నాయకులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును హన్మకొండలోని వారి గృహంలో కలిశారు.
ఈ సందర్భంగా గ్రామంలోని చాకలి రేవు కుడి చెరువు వద్ద కులదైవమైన మడేలయ్య ఆలయం నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని, శ్రీ మడేలయ్య, శ్రీ సీతల దేవత, శ్రీ ఈదమ్మ, శ్రీ వినాయకుడు, శ్రీ నంది, శ్రీ శివలింగం విగ్రహాలను బహుకరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు.

# కాంగ్రెస్, బీజేపీ కలిసి కేటీఆర్‌పై కుట్ర..

**- కేటీఆర్ పై ఏసీబీ విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడం పై స్పందించిన కెటిఆర్ సేన భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు వీసం భరత్ రెడ్డి**




**తొలి అక్షరం/ గణపురం:** ప్రజల తరఫున ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అక్రమ కేసులతో కట్టడి చేయాలని చూడడం మూర్ఖత్వమే అని కెటిఆర్ సేన భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టి యూత్ నాయకులు వీసం భరత్ రెడ్డి ధ్వజమెత్తారు. కేటీఆర్ పై ఏసీబీ విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడంపై స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్ములా ఈ రేసు అంశంలో రేవంత్ రెడ్డి సర్కారు మరోసారి డ్రామాలు మొదలుపెట్టింది అని ధ్వజమెత్తారు. ఇప్పటికే రెండు మూడు సార్లు కేటీఆర్ ను ఏసీబీ విచారించింది. ఇప్పుడు కొత్తగా మరోసారి విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడం ఏంటీ.? అని నిలదీశారు.
ఇదంతా కేవలం మీడియాలో ప్రచారం కోసం,డైవర్షన్ డ్రామా మాత్రమేనని అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని పెంచిన కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని అన్నారు. కాంగ్రెస్,బీజేపీలు కలిసి కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మరోసారి ప్రజల దృష్టిని మళ్లించే యత్నం ఇది అని ఆయన పేర్కొన్నారు.
ఫార్ములా ఈ రేసుతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కేటీఆర్‌పై బురద జల్లేందుకు చేస్తున్న కుటిల ప్రయోగం స్పష్టంగా కనిపిస్తుంది అని అన్నారు. మీ అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడదు అని న్యాయపరంగా, చట్టపరంగా ఎదుర్కుంటాం అని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన.

**- నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,**

**- నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి.**



**తొలి అక్షరం / నెక్కొండ మండలం నవంబర్ 21 :** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు రాయపురం సాంబమూర్తి ఇంటి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,డిసిసి ప్రధాన కార్యదర్శి పెండ్యాల హరి ప్రసాద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు,మండల ఉప అధ్యక్షులు భాను నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్, బ్లాక్ కాంగ్రెస్ మండల మహిళ అధ్యక్షురాలు రామారపు శిరీష రాము సంగని వెంకన్న, వద్దే సంతోష్, ఈదునూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యతి రాజారావు పార్కులో సమస్యలు పరిష్కరించాలి



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 21 :** తొర్రూర్ డివిజన్ కేంద్రంలో ఉన్న యతి రాజారావు పార్కులో సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ కు యతిరాజారావు పార్క్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ తొర్రూరు అధ్యక్షులు కత్తి రవీందర్, కార్యదర్శి ఏక్కటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులోనీ జిమ్ము పరికరాల మరమ్మతు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కమిషనర్ స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వింజమూరి సుధాకర్, నాయకులు కిన్నెర యాకయ్య, బొలగాని మహేష్, పెరుమాండ్ల రవి గౌడ్, రాములు, కావటి మంగమ్మ, బోడ బాలాజీ, సొంటి రెడ్డి భాస్కర్ రెడ్డి, రాయిశెట్టి వెంకన్న, సోమ రాములు, మోడం సోమ నరసయ్య, తాళ్లపల్లి బిక్షపతి, నరెడ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# దివంగత ఎస్సై హరీష్ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్



**తొలి అక్షరం, భూపాలపల్లి:** దివంగత ఎస్సై హరీష్ రుద్రారపు మొదటి వర్ధంతి కార్యక్రమం వారి స్వగృహం భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై, హరీష్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సై హరీష్ తన విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ మరియు బాధ్యతాయుతమైన సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివి అని అన్నారు. ఎస్సై హరీష్ లాంటి నిజాయితీ కలిగిన పోలీస్ అధికారిని కోల్పోవడం వారి కుటుంబానికి, బంధుమిత్రులకు, ఈ గ్రామానికి, మండలానికి, జిల్లాకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, గ్రామస్తులు ఉన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి... శాస సభ్యులు వైద్యులు భూక్యా మురళీ నాయక్..



**తొలి అక్షరం మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 21 :** మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ తెలిపారు.శుక్రవారం పురపాలక సంఘ పరిధిలోని కంబాల చెరువులో నాయకులతో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భం గా శాసనసభ్యులు మాట్లాడుతూ.. చేపలు వ్యాపారం ద్వారా మత్స్యకారులు వ్యాపారులుగా ఎదగాలని తెలిపారు. మొబైల్ వాహనాలు ద్వారా చేపల విక్రయానికి వాహనాలు మంజూరు చేసామని తెలిపారు. మత్స్య సంపద అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం రూ..123 కోట్ల మంజూరు చేసినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 50 శాతం మాత్రమే చిన్న చేప పిల్లలలో పంపిణీ చేసిందని, ప్రజాపాలనలో 100% నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేశామ న్నారు. మత్సకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ముదిరాజుల అభివృది కి ప్రజాపాలనలో ప్రత్యేక కార్యచరణ ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి రాజకీయాల ఆతీతంగా నాయకులు, ప్రజల సహాయ సహకారాలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు అధికారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు క్రమశిక్షణను పెంపొందిస్తాయి.. శాసన సభ్యులు వైద్యులు భూక్యా మురళీ నాయక్






**తొలి అక్షరం మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 21 :** క్రీడలు క్రమశిక్షణను పెంపొందిస్తాయని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో నిర్వహించిన 19వ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసన సభ్యులు వైద్యులు భూక్యా మురళీ నాయక్ మాట్లాడుతూ...విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడమే కాదు క్రీడాస్ఫూర్తిని జీవితంలో కొనసాగించాలని సూచించారు.ఈ క్రీడోత్సవాల్లో మూడు రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు పాల్గొని తాము సాధన చేసిన ప్రతిభను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడ్డారు.క్రీడలు ఆరోగ్యంతో పాటు నాయ కత్వ లక్షణాలు, సమయపాలన, పరస్పర గౌరవంవంటి విలువలను పెంపొంది స్తాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

## ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం వేడుకలలో పాల్గొన్న విష్ణు వర్ధన్ రెడ్డి..



పపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని ఏనుగుల గడ్డలో ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ర్యాలీలో పాల్గొని ,ముదిరాజ్ సంఘం జెండా ఎగురవేసి,మత్స్యకారులను సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముదిరాజ్ లు సమాజం విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందుకు రావాలంటే లక్ష్యపూర్వక కార్యక్రమాలు అవసరమని అన్నారు. సమాజ అభివృద్ధికి నైపుణ్యాలు కీలకమని, యువత అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో %వీజ్మూా% వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్,రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు,కార్యదర్శి నేరటి రాజు,మందల సమ్మయ్య,డివిజన్ అధ్యక్షులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తిలో న్యూట్రిషన్ మహోత్సవం గర్జిస్తోంది ఆరోగ్య మార్గం వైపు వేలాది అడుగులు

### మందులు లేకుండానే ఆరోగ్యమెంత
### సాధ్యమో ప్రత్యక్ష ఉదాహరణల ప్రవాహం
### ఈరోజు ఉదయం 8 నుంచి 11 గంటల
### వరకు అంబేద్కర్ సెంటర్లో విశేష కార్యక్రమం




**తొలి అక్షరం ఇనుగుర్తి నవంబర్ 21** ఇనుగుర్తి మండలంలోని ఈరోజు అంబేద్కర్ సెంటర్లో న్యూట్రిషన్‌కు సంబంధించిన మహా సెలబ్రేషన్ సందడిగా జరగనుంది. 300 మందికి పైగా న్యూట్రిషన్ ద్వారా రకరకాల అనారోగ్య సమస్యల నుంచి బయటపడిన వారు ఈ కార్యక్రమానికి హాజరై తమ అనుభవాలను పంచుకోనున్నారు. ప్రత్యేకంగా ఎలాంటి మందులు లేకుండా కేవలం న్యూట్రిషన్ ఫుడ్‌తోనే ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో, ఎలా తిరిగి సాధించుకోవచ్చో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి నిర్వాహకులు ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంప్రదించవలసిన నెంబర్ : ౭9944089133 (గంజి జనార్దన్ రెడ్డి)

## శంషాబాద్ డిసిపి ఆధ్వర్యంలో ఫరూక్ నగర్ లో కార్డెన్ సర్చ్

### కార్డెన్ సెర్చ్ లో పట్టుబడిన పత్రాలు లేని పలు వాహనాలు
### 24వాహనాలు సీజ్, 10డ్రంక్ అండ్ డ్రైవ్, 6బెల్ట్ షాపులు,రెండు గుట్కా షాపులపై కేసు నమోదు





**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 21**షాద్ నగర్ పరిధిలోని శాంతిభద్రతలను దృఢపరచడమే లక్ష్యంగా శుక్రవారం సాయంత్రం ఫరూక్‌నగర్‌లో పలు ప్రాంతాల్లో పోలీసులు భారీ ఎత్తున కార్డన్ %ఐ% సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.శంషాబాద్ డీసీపీ రాజేశ్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పలు కాలనీల్లో ఇంటింటా తనిఖీలు జరిగాయి.అద్దె ఇళ్లు, శివారు ప్రాంతాలు, లాడ్జిలు, హోటల్స్, ఖాళీ భవనాల్లో పోలీసులు సోదాలు జరిపారు. రౌడీ షీటర్లు, చరిత్రకేసులు, అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టి, వ్యక్తుల గుర్తింపు పత్రాలు, వాహనాల డాక్యుమెంట్లు పరిశీలించారు. గతంలో నేరాలకు పాల్పడినవారి ఇళ్లలో లోతైన తనిఖీలు చేపట్టారు.

**సీసీబీ, ఎస్ఓటీ , ట్రాఫిక్ తదితర విభాగాలు 234 మంది సిబ్బంది**

సీసీబీ, ఎస్ఓటీ, ట్రాఫిక్, స్పెషల్ బెటాలియన్ తదితర విభాగాలకు చెందిన 234 మంది పోలీసు సిబ్బంది ఆపరేషన్‌లో పాల్గొన్నారు. నెంబర్ ప్లేట్, డాక్యుమెంట్లు లేని 24 వాహనాలను సీజ్ చేశారు. రెండు షాపుల్లో గుట్కా నిల్వలు పట్టుకున్నారు.6 బెల్ట్ షాపులు ,అదనంగా 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

**శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే...కఠిన చర్యలు తప్పవు. డీసీపీ**

ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు అస్సలు సహించబోమని డీసీపీ రాజేశ్ స్పష్టం చేశారు. నేరకార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా ఇటువంటి ఆపరేషన్లను కొనసాగిస్తామని వెల్లడించారు. పోలీసులు ప్రజలను ఉద్దేశించి అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే సమాచారమివ్వాలని, శాంతిభద్రత పరిరక్షణలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో శంషాబాద్ డిసిపి రాజేశ్, అడిషనల్ డిసిపి పూర్ణచందర్, సీఐ విజయ్ కుమార్,తదితర ఉన్నతాధికారులు కూడా సోదాల్లో పాల్గొన్నారు.

## ఫరూక్‌నగర్‌లో విస్తృత కార్డెన్ సెర్చ్ తనిఖీలు

### శాంతి భద్రతలకు ... ఆటంకాలు కలిగిస్తే చర్యలు తప్పవు
### కార్డెన్ సెర్చ్ లో పాల్గొన్న శంషాబాద్ డీసీపీ రాజేష్ కుమార్, ఏసిపి లక్ష్మీనారాయణ



**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 21**శంషాబాద్ డీసీపీ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం ఫరూక్‌నగర్ పరిధిలో విస్తృత కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రాంతంలో భద్రతా పరిస్థితులను బలోపేతం చేయడం, నేర కార్యకలాపాలను అరికట్టడం, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం లక్ష్యంగా పోలీసులు ఇంటింటి తనిఖీలు చేపట్టారు.ఆపరేషన్‌లో భాగంగా ముఖ్యంగా అనుమానాస్పద ఇళ్లు, అద్దె గృహాలు, శివారు ప్రాంతాలు, వాహనాలు, లాడ్జిలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వాహనాలు, వ్యక్తుల వివరాలను సేకరించి డాక్యుమెంట్లు పరిశీలించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం అందిన ప్రదేశాల్లో ప్రత్యేక టీమ్‌లతో సమగ్ర సోదాలు నిర్వహించారు.

## షాద్ నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలు

### పండుగల సాయన్న విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు
### మత్స్యకారుల గౌరవప్రదమైన రోజుగా జెండా ఆవిష్కరణ
### జెండాను ఆవిష్కరించిన తాలూకా ముదిరాజ్ సంఘం నాయకులు





**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 21**ప్రతి నియోజకవర్గంలో ముదిరాజులు చైతన్యం కావాలని విద్యా ఉద్యోగ ఆర్థిక సామాజికంగా మేమెంతో మాకు అంత అనే నినాదంతో మన హక్కులను మనం సాధించుకోవాలని షాద్ నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. షాద్ నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ సందర్భంగా తాలూకా అధ్యక్షులు మంగ వెంకటేష్ ముదిరాజ్ కొండ యాదయ్య ముదిరాజ్ కోశాధికారి యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మముదిరాజ్, యువత ఉపాధ్యక్షులు మంగ అశోక్ ముదిరాజ్, సంఘం నాయకుల ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాలకు ఆదర్శంగా నిలబడిన పండుగ సాయన్నకు పూలమాలతో పుష్పాలతో నమస్కరించి జాతి చైతన్యం కోసం మత్స్యకారుల గౌరవప్రదమైన రోజుగా జెండా ఆవిష్కరణ చేశారు. తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు సుంకరబోయిన మహేష్, నారబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ షాద్ నగర్ సంఘం సభ్యులను అభినందించారు. తాలూకా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో ముదిరాజులు చైతన్యం కావాలని విద్యా ఉద్యోగ ఆర్థిక సామాజికంగా మేమెంతో మాకు అంత అనే నినాదంతో మన హక్కులను మనం సాధించుకోవాలని అన్నారు. పండుగ సాయన్న, జ్యోతిరావు పూలేని స్ఫూర్తిగా తీసుకోవాలని, మహనీయుల బాటలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సమస్యల పైన రాష్ట్రస్థాయి నాయకులతో మాట్లాడి చేయూత ఇవ్వాలి షాద్ నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ తాలూకా గౌరవ సలహాదారులు అందే పైలయ్య ముదిరాజ్,గౌరవాధ్యక్షులు చెట్ల జంగయ్య ముదిరాజ్,గౌరవ అధ్యక్షుడు నల్లమోని బిక్షపతి,పద్మ కృష్ణయ్య ముది రాజ్, సంఘం ప్రధాన కార్యదర్శి పూజారి మల్లేష్ ముదిరాజ్, జెయింట్ సెక్రెటరీ గడ్డమీద రమేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంగం మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ ముదిరాజ్, సంఘం కార్యవర్గ నాయకులు గుడాలగిరి బాబు ముదిరాజ్, పిట్టల అంజయ్య ముదిరాజ్, లీగల్ అడ్వైజర్ మల్లేష్ ముదిరాజ్, గూడూరు సురేష్ ముదిరాజ్, సంఘం కార్యవర్గ సభ్యులు, గోనెల యాదగిరి ముదిరాజ్ ఢిల్లీ శివ ముదిరాజ్, పద్మ సాయి ముదిరాజ్, పి కన్నయ్య ముదిరాజ్ కార్తీక్ ముదిరాజ్, కుక్కలమహేష్ ముదిరాజ్, రవి ముదిరాజ్, అజయ్ ముదిరాజ్ పరమేష్ ముదిరాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గుర్రం యాదగిరి రెడ్డి 4 వర్ధంతి వేడుకలు



**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 21:**సిపిఐ మాజీ శాసనసభ్యులు తెలంగాణ సాయుధ పోరాట సమరయోధుడు కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా రామన్నపేట మండల కేంద్రంలోని ఘనంగా నివాళులు జోహార్లు అర్పించి కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి త్యాగాలను స్మరించుకుంటూ కమ్యూనిస్టుగా ఆదర్శ జీవితాన్ని కొనియాడిన సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ్మమాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది సొంత ఇల్లు కూడా లేకుండా ప్రజాసేవకు అతని జీవితాన్ని అంకితం చేశారు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి అని అన్నారు నేటి యువతకు యాదగిరి రెడ్డి జీవిత చరిత్ర ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ నాయకులు పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య మండల సహాయ కార్యదర్శి కళ్లెం రామచందర్ సీనియర్ కామ్రేడ్ ఊట్కూరి భగవంతు ఏనుతల రమేష్ ఊట్కూరి కృష్ణ సిహెచ్ మల్లేశం మీసం గాలయ్య కళ్లెం యాదగిరి కొండ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు

## రామన్నపేట గురుకుల హాస్టల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించిన లీగల్ సర్వీసెస్ టీమ్



రామన్నపేట, నవంబర్ 21మండల పరిధిలోని జనంపల్లి తెలంగాణ గురుకుల పాఠశాల నందు శుక్రవారం మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్వర్యంలో పాఠశాల ఇంఛార్జి ప్రిన్సిపల్ నాగమణి సమక్షంలో లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేశారు. అక్కడ విద్యార్థులకి, కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు, మౌలిక సదుపాయాల పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారికి మధ్యాహ్న భోజన సదుపాయం ను వంటలను పరిశీలించారు. వసతి గృహం నందు విద్యార్థులు ఉపయోగించే వాష్ రూమ్, టాయిలెట్స్, క్లీనింగ్, వంట గదులు, అన్ని పరిశీలించి, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఉన్న లీగల్ సర్వీసెస్ టీమ్ దృష్టికి తీసుకురావాలి సూచించారు. విద్యార్థులకి ఏర్ బి ఎస్ కే ద్వారా నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను, విధానం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యులు కానుగంటి శ్రీశైలం, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

## ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ దాతలు



**తొలి అక్షరం:వలిగొండ, నవంబర్, 21.** అరూరు గ్రామానికి చెందిన కొడీతాల లక్ష్మయ్య పద్మ గార్ల కుమారుడు కొడితాల సంతోష్ ప్రభుత్వ ఆస్పటల్ కి వాటర్ ప్యూరిఫైర్ ఇచ్చినారు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వాళ్లకోసం దాహం తీర్చడం కోసం మంచి అభిప్రాయంతో మంచి మనసుతో అర్థం చేసుకొని గతంలో కూడా చిన్నపిల్లల కోసం వామర్ పుట్టిన పిల్లల కోసం వేడిగా ఉండే పరికరం ఇచ్చారు అరూర్ ప్రభుత్వ ఆస్పటల్ మరియు వేములకొండ హాస్పిటల్ డి ఎం హెచ్ ఓ గారు ధన్యవాదములు తెలిపినారు మరియు ఇంతకుముందు హాస్పటల్ కి అభివృద్ధి సహాయము చేసిన వారిని అందరికీ పేరుపేరునా మరొక్కసారి ధన్యవాదా ములు తెలుపుచున్నాము ఈ కార్యక్రమంలో వాటర్ ఫిల్టర్ ఆరూరు ఆస్పటల్ కి ఇచ్చినందుకు ఆమ్ సెంటర్ %ఎశ్రీప్త్రజూ. ాఆఓఅబ% మేడం%జూష్ట్రఒ% డాక్టర్ వేణు మాధవి గారు ఏఎన్ఎంలు శోభారాణి సంధ్యారాణి గార్లు ఆశాలు వెంపటి రాణి మారగొని సంతోష గారు ఆయాలు తదితులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల పై కేసు నమోదు

**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 21:** తేది 21.11.2025 న సాయంత్రం రామన్నపేట గ్రామం లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వం నిశేదించిన పేకాటను ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం రాగా! అట్టి సమాచారం మేరకు ఎస్సై రామన్నపేట ఆదేశానుసారం పోలీసు కానిస్టేబుల్ ప్రవీణ్, ప్రశాంత్, అన్వర్, రవి, మహేష్ లు కలిసి రామన్నపేట గ్రామ శివారు ప్రాంతాల్లో నీ ఐజిఎం చర్చ్ ఎదురుగా పేకాట ఆడుతున్న రామన్నపేట కు చెందిన శివరాత్రి కుమార్ అంజయ్య కుమారుడు, వయస్సు: 33 సంవత్సరాలు షేక్ యూసుఫ్ మధర్ కుమారుడు, వయస్సు: 47 సంవత్సరాలు చినపాక శ్రవణ్ యాదయ్య కుమారుడు, వయస్సు: 35 సంవత్సరాలు వెరమల్ల నర్సింహ సైలూ కుమారుడు, వయస్సు: 57 సంవత్సరాలు బుడ్డ లింగస్వామి యాదయ్య కుమారుడు, వయస్సు: 39 సంవత్సరాలు లను పట్టుకొని వారి దగ్గర నుండి 3 మొబైల్ ఫోన్ లను మరియు 1820/- రూపాయలను స్వాదినం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాము రామన్నపేట ఎస్సై డి నాగరాజు పత్రికా ప్రకటనలో తెలిపినారు

## రైతులు అగ్రీ క్లినిక్ సేవలు వినియోగించుకోవాలి

### లీగల్ సెల్ సభ్యులు కానుగంటి శ్రీశైలం



**రామన్నపేట, నవంబర్ 21**మండల కేంద్రంలోని రైతు వేదిక నందు లీగల్ సర్వీసెస్ అధ్వర్యంలో ఆగ్రీ క్లినిక్ (వ్యవసాయ న్యాయ సహాయ సలహా కేంద్రం) సేవలను వినియోగంచుకోవాలని అన్నారు. ఈ క్లినిక్ నందు లీగల్ సర్వీసెస్ నుండి కానుగంటి శ్రీశైలం హాజరై మాట్లాడుతూ ఇక్కడ రైతులకి కావలసిన భూ చట్టాలు, వయో వృద్ధులు సంక్షేమం, వ్యవసాయ అనుబంధ న్యాయ సలహాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఏదైనా సమస్యలు ఉన్న ప్రతి మంగళవారం, శుక్రవారాలలో ఇక్కడ క్లినిక్ నందు అందుబాటులో ఉండనున్నట్లు, రైతు హజరవడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు.


## ఘనంగా భూపాలపల్లిలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు



**తొలి అక్షరం (నవంబర్22) జయశంకర్ భూపాలపల్లి:** జిల్లా కేంద్రంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం శోభాయమానంగా జరిగింది.జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి భారీ సంఖ్యలో మత్స్యకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్ ప్రసంగిస్తూ,మత్స్యకారుల జీవనోపాధి మరియు సంక్షేమ విషయాలపై ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. ఈ దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించి, ప్రతి ఏటా రాష్ట్ర స్థాయిలో ఘనంగా జరపాలని, ప్రతి జిల్లా కేంద్రంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని సూచించారు. అంతేకాకుండా, ప్రతి మండలంలో చేపల విక్రయానికి ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేసి, అవసరమైన సౌకర్యాలు (విద్యుత్, నీరు, షెడ్‌లు) కల్పించాలని అభ్యర్థించారు.అదేవిధంగా18 సంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి ముదిరాజ్ యువకుడికి మహాసభ సభ్యత్వం ఇవ్వాలి.చేపల విక్రయానికి ద్విచక్ర వాహనాలు, ఆటోలను 90 శాతం సబ్సిడీతో అందించాలి. సభ్యుల జీవనోపాధికి సహాయకంగా సున్నా వడ్డీతో రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలి. ప్రమాదాల వల్ల మరణిస్తే సభ్యుడికి రూ.10 లక్షల భీమా కవరేజ్‌ను ఏర్పాటు చేయాలి.ఉచిత చేప పిల్లల సరఫరా విధానాన్ని సమీక్షించి, మత్స్య సహకార సంఘాల ఖాతాలకు నేరుగా నిధులు జమ చేయాలని ఆకుల సుభాష్ ప్రతిపాదించారు. దీంతో మత్స్యకారులు నాణ్యమైన పిల్లలను స్వయంగా కొనుగోలు చేసి, సరైన సమయంలో నీటిలో విడుదల చేయగలరని వివరించారు. ఇది మత్స్య ఉత్పాదకతను పెంచి, ఆదాయాన్ని మెరుగుపరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ముదిరాజ్ సంఘాల నేతలు కొలిపాక మల్లయ్య, వెంగళ అంజన్న, వేముల రాజమౌళి, మారబోయిన ధనుంజయ్, చాడ కృష్ణస్వామి, జోరుక సదయ్యలు పాల్గొని, మత్స్యకారుల అభివృద్ధి మరియు సంక్షేమానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలు మత్స్యకారుల సమస్యలపై అధికారుల దృష్టిని ఆకర్షించి, రాష్ట్ర ప్రభుత్వం శ్రేయస్సుకు దారితీస్తాయని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రపంచంలో ఏకైక శ్రీకృష్ణ స్నేహితుడు సుదాముని ఆలయం.. ఎక్కడ ఉందంటే..










స్నేహానికి చిహ్నం శ్రీకృష్ణ, సుధామలు. అయితే శ్రీకృష్ణుడికి దేవుడిగా దేశ విదేశాల్లో మందిరాలు ఉన్నాయి. అయితే శ్రీకృష్ణుడు, తన స్నేహితుడైన సుధాముడితో కలిసి పూజలను అందుకుంటున్నా ఆలయం.. దేశంలో ఒకేఒక్కటి ఉంది. దానిని సుధామపురి అని పిలుస్తారు. మరి ఆలయం ఎక్కడ ఉంది. ఆలయ విశిష్టత గురించి తెలుసుకుందాం.. గుజరాత్ పోర్ బందర్ తాలూకాలో ఓ గ్రామంలో సుధాముడి జన్మించినందున ఆ ప్రాంతాన్ని సుదామపురి అని పేరు వచ్చింది. శ్రీ కృష్ణునిని లీలలు చూసి ఆనందించడానికే నారద మహర్షి మధు, కారోచన అనే దంపతులకు సుదాముడుగా జన్మించాడని ప్రతీతి.సుదాముడు జన్మించిన ఈ గ్రామంలో 12 వ 13వ శతాబ్దాల మధ్య సుధామ ఆలయం నిర్మాణం జరిగింది.

ఈ ఆలయం ప్రమంచంలోనే సుదామునికి నిర్మించిన ఏకైక ఆలయంగా ప్రఖ్యాతి చెందింది. సుదాముడు జన్మించిన ఈ గ్రామంలో 12 వ 13వ శతాబ్దాల మధ్య సుధామ ఆలయం నిర్మాణం జరిగింది. ఈ ఆలయం ప్రమంచంలోనే సుదామునికి నిర్మించిన ఏకైక ఆలయంగా ప్రఖ్యాతి చెందింది.రాజస్థాన్‌కు చెందిన రాజా వంశీకులు వివాహమైన తర్వాత కొత్త దంపతులు సుదాముని ఆలయానికి వచ్చి పూజలు చేయడం ఆచారం.ఈ ఆలయం గర్భగుడిలో సుదాముడు, ఎడమ ప్రక్కన సుధాముడి భార్య సుశీల, కుడిప్రక్కన శ్రీ కృష్ణుడు ఆశీనులై దర్శనమిస్తారు.యాభై స్థంభాలతో నిర్మించబడిన మహామండపం తర్వాత గర్భగుడి వుంది.

ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ద్వారపాలకుల విగ్రహాలు ఆకట్టుకుంటాయి. గర్భగుడికి మీద ఉత్తర దేశ బాణీలో ఎత్తైన విమానం కనిపిస్తుంది. ఆలయానికి చుట్టూ నందనవనం, సుదాముడు ఉపయోగించిన బావి ఉన్నాయి. పూజావేళలు: ఈ ఆలయంలో నిత్యం రాత్రి ఏడు గంటలకు సంధ్యా హారతి, స్వామివారికి 'దామాజీ తండుదల్' (కుచేలుని అటుకులు)లను నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ అటుకుల ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులకు సిరిసంపదలు, కోరుకున్న కోర్కెలు తీరతాయని నమ్మకం. ఇక అక్షయ తృతీయ రోజున "కుచేలుని దినం" గా ఈ సుధామాలయంలో ఉత్సవాలు జరుపుతారు.

# భారత్‌లో అతి పొడవైన గ్లాస్ వంతెన.. ఆకాశంలో నడుస్తున్నట్టే!



చాలా మందికి ప్రకృతి అందాలను వీక్షించడం అంటే ఎంతో ఇష్టం. ముఖ్యంగా ఎత్తైన కొండల మధ్య గాలిలో తేలియాడుతూ, సముద్రంపై చాలా ఎత్తుల్లో ఎగురుతూ ఎంజాయ్ చేయాలని అనుకుంటారు. అలానే పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వంలో అనేక వింత, అద్భుతమైన కట్టడాలను నిర్మిస్తుంటాయి. తాజాగా ఎత్తైన ప్రదేశం నుంచి గాల్లో తేలియాడుతూ.. ప్రకృతి అందాలను చూడాలని అనుకుని వారి ఆశలకు రూపం కల్పిస్తోంది ఓ గ్లాస్ బ్రిడ్జి. కేరళలోని ఇడుక్కి జిల్లాలో ఈ గాజు వంతెనను ప్రారంభించారు. ఇప్పుడిది దేశంలోనే పొడవైన గాజు వంతెన. మరి%ోా% ఈ వంతెన నిర్మాణానికి అయిన ఖర్చు, ఇతర ప్రత్యేకతల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..కేరళ రాష్ట్రంలోని ఇడుక్కి జిల్లాలో వగమాన్ ప్రాంతంలో గాజు వంతెనను నిర్మించారు. సముద్ర మట్టానికి 3600 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ వంతెన కోసం రూ.3 కోట్లు ఖర్చు చేశారు. కేరళ సర్కార్ పీపీపీ భాగస్వామ్యంతో ఈ గాజు వంతెనను నిర్మించింది. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న 35 టన్నుల స్టీల్ న ఉపయోగించారు. ఇక ఈ గాజు బ్రిడ్జిపైకి వెళ్లాలంటే.. ప్రవేశ రుసుము రూ. 500 చెల్లించాలి. దీంతో పాటు స్కై వింగ్, స్కై సైక్లింగ్, స్కై రోలర్, రాకెట్ ఇంజెక్టర్, జెయింట్ స్వింగ్ లాంటి అడ్వెంచర్ లాంటివి కూడా ఏర్పాటు చేశారు.వీటి కోసం వేరే ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాక అన్నీ కలిపి ప్రత్యేక ప్యాకేజీ కూడా ఉంది. టూరిస్ట్ లకు సరికొత్త అనుభూతిని పంచేందుకు అడ్వెంచర్ టూరిజం పార్కును ప్రారంభించామని ఆ రాష్ట్ర పర్యాటక మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్ తెలిపారు. బుధవారం ఈ వంతెనను ప్రారంభించారు. ఇక్క మరో విశేషం ఏమిటంటే.. భారత దేశంలోనే అతిపొడవైన గాజు వంతెన ఇదే. ఈ గాజు వంతెన పొడవు 40 మీటర్లు ఉండగా.. ఏకకాలంలో 15 మందిని మాత్రమే అనుమతిస్తారు.

గాజు పలకల ఆధారంగా రూపొందించిన ఈ వంతెన దారిలో నడిచి.. పచ్చని ప్రకృతి రమణీయతను, సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. అలాగే పొగ మంచుతో కప్పుకున్న కొండల అందాలు మరింత ఆకర్షణీయం. ఈ గ్లాస్ బ్రిడ్జిపై నడుస్తుంటే.. ఆకాశంలో నడుస్తున్నామన్న అనుభూతి కలుగుతుందని పర్యాటకులు చెబుతున్నారు. మరి.. ఇంకేందుకు ఆలస్యం మీరు కూడా కేరళ వెళ్లే.. ఈ అనుభూతిని ఆస్వాదించండి. మరి.. ఈ గాజు వంతెన గురించి మీ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో తెలియజేయండి.

# చారిత్రక, శిల్పకళా అద్భుతం రామప్ప రుద్రేశ్వరాలయం



యావత్ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను ఏకీకృతం చేసి సమర్థవంతంగా పరిపాలించిన కాకతీయులు అన్నిరంగాలలో రాజ్యాన్ని అగ్రస్థానంలో నిలబెట్టినారు. వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిచ్చి వందల, వేల చెరువులు త్రవించినారు. శైవం, వైష్ణవం, జైనం, శాక్తేయం %ోా% అన్ని మతాలను ఆదరించి సర్వమత సమానత్వాన్ని పాటించినారు. దైవభక్తితో అనేక ఆలయాలను నిర్మింపచేసి, వాటికి తగిన వసతులు కలిగించి విరివిగా భూదానాలు చేసినారు. కాకతీయుల కాలంలో నిర్మించబడిన ఆలయాలు అద్భుత శిల్పకళా నైపుణ్యంతో ఆనాటి వాస్తుశిల్పుల, శ్రామికుల పనితనం నేటికి సజీవంగా మనకు కనువిందు చేస్తున్నాయి.భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాలో ఉన్న ఒక గ్రామంలో ఉన్న అద్భుత దేవాలయం ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చేరి యునెస్కో గుర్తింపు పొందింది. అదే మన రామప్ప దేవాలయం. ఇది పాలంపేట గ్రామంలో ఉంది. గొప్ప వారసత్వ సంపదగా నిలిచిన ఈ ఆలయం కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని కాలంలో నిర్మించబడింది. పాలంపేటలో రుద్రేశ్వరాయలంలో రేచర్ల రుద్రుడు వేయించిన శాసనం వల్ల రామప్ప ఆలయాన్ని కాకతీయ సామంత రాజైన రేచర్ల రుద్రుడు నిర్మించినట్లు తెలుస్తోంది. ఇది ఒక అద్భుతమైన, శిల్పవిన్యాస శోభితమైన, వాస్తుశాస్త్ర, సాంకేతికపరమైన విశేష నిర్మాణంగా చెప్పవచ్చు. ఈ ఆలయం గణపతిదేవుని కాలంలో నిర్మించబడింది. రుద్రమదేవి కాలంలో కూడా కొన్ని నిర్మాణాలు కొనసాగినట్లు డా. పి.వి. పరబ్రహ్మశాస్త్రి పేర్కొన్నారు. రామప్ప ఆలయానికి ఆ పేరు రావడానికి స్థానికంగా, చారిత్రకంగా అనేక కథనాలు మనకు వినిపిస్తున్నాయి. స్పష్టమైన ఆధారాలు ఏవీ లేవు. రేచర్ల రుద్రుడు నిర్మించిన ఆ ఆలయం రుద్రేశ్వరాలయంగా పిలువబడుతూ, రామప్ప దేవాలయంగా ప్రసిద్ధి చెందింది.భారతీయ శిల్పకళా చరిత్రలో కాకతీయుల శిల్పనిర్మాణశైలి ఒక ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంది. అందులో రామప్ప ఆలయం అపురూప శిల్పకళాశోభితమై నేడు అంతర్జాతీయఖ్యాతిని పొందినది. ఈ శిల్పాలు కవుల హృదయాలను కదిలించి కవిత్వం చెప్పిస్తాయి. గాయకులు శ్రావ్యమైన పాటలు పాడే ఉత్సాహాన్నిస్తాయి. నర్తకులు ఆ నృత్యభంగిమలను అనుకరిస్తూ నాట్యం చేస్తారు. జాయపసేనాని రచించిన నృత్తరత్నావళికి ఊతమిచ్చిన మూల శిల్పాలు ఈ రామప్ప దేవాలయంలోని నాట్యభంగిమలు. ఇంతటి ఖ్యాతి గాంచిన ఈ రామప్ప దేవాలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వపు కట్టడాల గుర్తింపు రావడానికి ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి విశేషమైనది. దానికి కేంద్ర ప్రభుత్వం సహకరించింది.

రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ గుర్తింపు రావడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి సంవత్సరం 2015 నుండే ప్రయత్నాలు ప్రారంభించింది. ద గ్లోరియస్ కాకతీయ టెంపుల్స్ అండ్ గేట్‌వే పేరుతో ప్రతిపాదనలు పంపినారు. తత్ఫలితంగా 2019లో యునెస్కో పక్షాన ఐకోమాస్ (ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్) ప్రతినిధిగా వాసుపోశానంద్ రామప్పను సందర్శించి పరిశీలించి, కొన్ని సూచనలు చేసినారు. దాని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆలయం చుట్టూ బఫర్‌జోన్ ఏర్పాటుచేసింది. వాసుపోశానంద్ చేసిన సూచనల ప్రకారం భారతదేశం తరఫున 2020 సంవత్సరానికి ప్రపంచ వారసత్వ సంపదల జాబితాలో చేరడానికి రామప్ప దేవాలయం ప్రతిపాదించబడింది. 2021 జూన్‌లో రాష్ట్ర మంత్రులు, అధికారులు కేంద్ర మంత్రులను కలిసి హోదాకు సంబంధించిన కార్యక్రమాలు తీవ్రతరం చేయాలని కోరినారు. తత్సంబంధంగా ఆలయానికి సంబంధించిన చరిత్ర, కట్టడాల విశేషాలతో కూడిన వీడియో సీడీలను, పుస్తకాలను రూపొందించి సమర్పించినారు. ఐకోమాస్ సూచించిన విధంగా రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖలలోని వారితో సమన్వయ కమిటీని రూపొందిచడమే కాదు, రామప్ప పరిసర ప్రాంతాల్లో ఉన్న రెండు ఆలయాలను రామప్ప ఆలయ పరిధిలోకి తీసుకువచ్చినారు.

**యునెస్కో గుర్తింపు వల్ల ప్రయోజనమేమిటి?**

ఈ హోదాతో కాకతీయుల శిల్పకళావైభవం ప్రపంచమంతా తెలిసే అవకాశం ఉంటుంది. విశ్వవ్యాప్తమైన ఈ అద్భుత కట్టడాన్ని చూడడానికి విదేశీయులు, స్వదేశీయులు చాలామంది వస్తారు. తత్ఫలితంగా సాంస్కృతికమైన మార్పులు చేర్పులు పరస్పరం జరుగుతాయి. విభిన్న సంస్కృతుల పరిచయం ఏర్పడుతుంది.

వరల్ట్ హెరిటేజ్ ఫండ్ 1977 చట్టం క్రింద ఆలయ అభివృద్ధికి నిధులు అందుతాయి. ఆలయ పరిరక్షణకు యునెస్కో ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తుంది. ప్రకృతి బీభత్సాలు ఏర్పడినప్పుడు కట్టడానికి ఏమైనా ప్రమాదం జరిగితే పునరుద్ధరించేందుకు ర్యాపిడ్ రెస్పాండ్ ఫండింగ్ కూడా లభిస్తుంది.రామప్ప ఆలయ విస్తరణ, రామప్ప చెరువు, కామేశ్వరాలయాలపై మరింత స్పష్టత వస్తుంది. ఐకోమస్ సూచనల మేరకు రామప్ప ఆలయ పరిధి మరింత విస్తృతమయ్యే అవకాశం ఉంటుంది.యునెస్కోతో పాటు రామప్ప ఆలయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు గణనీయంగా లభిస్తాయి. రవాణా, వసతి సౌకర్యాలు మెరుగవుతాయి. దానివల్ల దేశీయ, విదేశీయ పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. రామప్పను సందర్శించినవారు చుట్టుప్రక్కల ఉన్న విశేష కట్టడాలు, ఆలయాలు, చారిత్రక సంపదను చూస్తారు. ఇది పర్యాటకరంగ అభివృద్ధికి కారణమవుతుంది. ఉపాధి అవకాశాలు కూడా చాలా ఉంటాయి.

# దేశంలోనే ఇవి అందమైన గ్రామాలు.. ఓ లుక్కేయండి





దేశంలో చాలా గ్రామాలు ఉన్నాయి. కానీ అందులో కొన్ని మాత్రమే అందమైన గ్రామాలుగా పేరుపొందాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. హిమాచల్ ప్రదేశ్‌లోని కల్ప అనేది ఓ రహస్య గ్రామం. ఇది హైవే నుంచి చూస్తే కనిపించదు. అయితే ఈ గ్రామం అందరిని ఆకర్షిస్తుంది. గ్రామం చుట్టూ చూస్తే యాపిల్ తోటలే కనిపిస్తాయి. ఇక్కడ నుంచి ఏకంగా కైలాస పర్వత మంచు శిఖరాలను సైతం చూడొచ్చు. ఇక్కడ కనిపించినట్లుగా ఆ శిఖరాలు మరోచోటు కనిపించవు.మేఘాలయలోని తూర్పు ఖాసీ హిల్స్‌లో ఉన్న మావ్లిన్నోంగ్ అనే గ్రామం అసలు ఆసియాలోనే పరిశుభ్రమైదిగా నిలిచింది. ఈ గ్రామాన్ని దేవుడి తోట అని కూడా అంటారమటే ఇది ఎంత అందమైనదో తెలుస్తుంది. అలాగే ఈ గ్రామంలో ప్లాస్టిక్ వినియోగం అనేదే ఉండదు. వెదురుతో చేసిన డస్ట్‌బిన్‌లను మాత్రమే ఇక్కడ వినియోగిస్తారు.

రాజస్థాన్‌లో ఖిమ్‌సర్ అనే గ్రామంలో చుట్టూ స్వచ్ఛమైన గాలి, ఇసుకతో కూడి ఉంటుంది. ఊరి మధ్యలో ఓ సరస్సు కనిపిస్తుంది. ఇక్కడ అందమైన చెట్లు, గుడిసెలు అందర్ని కనువిందు చేస్తాయి. ఈ గ్రామాన్ని ఇసుక దిబ్బల గ్రామం అని కూడా పిలుస్తారు. అంతేకాదు ఇది ఓ అందమైన రిసార్ట్‌ను తలపిస్తుంది. ఇక్కడ సుమారు 300 నుంచి 400 అడుగుల ఎత్తులో ఉన్న మట్టి దిబ్బలు కనిపిస్తాయి.కేరళలోని తిరువనంతపురానికి దక్షిణ తీరాన ఉన్న పూవార్ అనే గ్రామం ప్రకృతి అందాలకు పెట్టిన పేరుగా నిలిచింది. ఇక్కడి పరిశుభ్రమైన, అందమైన బీచ్‌లు పర్యాటకులను ఎక్కువ రోజులు ఇక్కడే గడిపేలా చేస్తాయి. అక్టోబర్– ఫిబ్రవరి మధ్య కాలం ఈ గ్రామాన్ని సందర్శించేందుకు మంచి సమయం.ఒడిశాలోని చంద్రగిరి అనే గ్రామం స్వచ్ఛమైన గ్రామీణ జీవితాన్ని చవిచూసేందుకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఉన్నటువంటి జిరాంగ్ లోయ, బౌద్ధ దేవాలయాలు అందరినీ ఆకర్షిస్తాయి. అయితే ఈ గ్రామం పరిశుభ్రతకు పెట్టిన పేరుగా నిలిస్తోంది.

# నిర్లక్ష్యం చేస్తే.. వెన్నుపోటే



**వెన్నునొప్పి.. ఆధునిక జీవనశైలితో అవినాభావ సంబంధం కలిగి ఉన్నది. ఈ నొప్పి.. ఒకచోట తీరికగా కూర్చోనివ్వదు. నిమ్మళంగా నిలబడనివ్వదు కూడా. ప్రశాంతంగా పడుకోనివ్వదు. వెన్నులో వణుకు పుట్టిస్తుంది. దానిని ఢీకొట్టే ప్రయత్నం చేయకుండా భయపడితే మాత్రం వెన్నుకు పోటు తప్పదు. సున్నితమైన.. బాధాకరమైన వెన్నునొప్పి ఎందుకొస్తుంది? లక్షణాలేంటి? చికిత్స ఏంటి? తెలుసుకుందాం. వెన్నునొప్పి అనగానే ఏం చేస్తాం? సమయం లేకనో.. సమస్య చిన్నదేగా అనే ఉద్దేశంతోనో వెన్నునొప్పి సమస్యను సీరియస్‌గా తీసుకోం. ఉపశమనం కోసం పెయిన్ కిల్లర్ టాబ్లెట్స్, పెయిన్ రిలీవింగ్ ఆయింట్‌మెంట్స్ వాడుతుంటాం. కానీ కొందరిని ఇది దీర్ఘకాలికంగా వేధిస్తుంటుంది. అలర్ట్‌గా ఉంటే దీనికి శాశ్వత పరిష్కారం చూపించవచ్చు.**

### ఎందుకు వస్తుంది?

ఉరుకులు పరుగులతో సాగే ఆధునిక జీవితంలో చాలామందికి వెన్నునొప్పి సమస్య ఎదురవుతున్నది. వీపు దిగువ భాగంలో కండరాలు విపరీతంగా అలసిపోవడంతో వెన్ను నొప్పి మొదలవుతుంది. వీపు కింది భాగంలో ఉండే అనేక కండరాలు.. లిగమెంట్స్ వెన్నుపూసలకు అతుక్కొని ఉంటాయి. ఇవి మొత్తం వెన్నుని వీపు మధ్యలో నిలబెడుతాయి. కూర్చున్నప్పుడు.. నిలబడ్డప్పుడు.. పనిలో ఉన్నప్పుడు ఆ కండరాలు విపరీతంగా సాగుతాయి.

### అస్థిరతే కారణమా?

కొంతమందిలో స్థిరపడిన అలవాట్ల కారణంగా చిన్న వయసు నుంచే ఈ కండరాల పైన నిరంతరం ఒత్తిడి కలుగుతుంది. శ్రమతో కూడిన పనిచేయడం వల్ల సాగిన కండరాలు బాగా అలసిపోతాయి. బలహీనపడతాయి కూడా. దీనివల్ల వెన్ను సరైన ప్రదేశంలో నిలిపి ఉండలేదు. ఇక వెన్ను కొంత అస్థిరపడి నొప్పి మొదలవుతుంది. వెన్ను అస్థిరత వల్ల నాడులపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడి వీపు నుంచి వివిధ శరీర భాగాలకు నొప్పి వ్యాపిస్తుంది. వయసు పెరుగుతున్నాకొద్దీ వెన్నుపూసల మధ్య ఉండే డిస్క్‌లోని కార్టిలేజ్ పలుచబడుతుంది. ఫలితంగా బలహీనంగా.. పెళుసుగా మారి వెన్ను నుంచి బయటకు వచ్చే నాడులకు ఒత్తిడి ఎక్కువై వెన్ను నొప్పి వస్తుంది.

### ఎలా వ్యాపిస్తుంది?

వీపు కింది భాగం నుంచి ప్రారంభమైన నొప్పి తొడమీదుగా శరీరమంతటా వ్యాపిస్తుంది. దీనిని సయాటిక అంటారు. శరీరంలో పొడవైన నాడీ అయిన ఈ సయాటిక ఏ కొద్దిమాత్రం దెబ్బతిన్నా ఆ నొప్పి అన్ని శరీర భాగాల్లోనూ ఉంటుంది. కొందరిలో ఇది తీవ్రమైందిగా మారి రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తుంది. ప్రధానంగా వెన్నులోని లోయర్ లంబార్.. లంబోసాక్రల్ నాడులు.. వీపు దిగువన వెన్ను నాళం ఇరుకుగా మారుతాయి. వెన్నుపూసల మధ్య పలుచని పరుపులా ఉండే డిస్క్‌లో పగుళ్లు వస్తాయి. వెన్నుపూస తన ముందున్న దానిపైకి దూరి వీపు-పిరుదుల ప్రాంతంలోని కండరాలు ఒక్కసారి విపరీతంగా చలిస్తాయి.

ఎలా నిర్ధారిస్తారు?

వెన్నునొప్పితో బాధపడుతున్న వ్యక్తులు చెప్పిన లక్షణాలు, ఫిజికల్ ఎగ్జామినేషన్ తోపాటుగా మరికొన్ని పరీక్షలు జరిపించటం ద్వారా వెన్ను నొప్పిని నిర్ధారిస్తాం. వ్యాధిగ్రస్థులతో మాట్లాడటం ద్వారా నొప్పి ఎప్పుడు.. ఏవిధంగా ప్రారంభమయ్యింది? దేనివల్ల ప్రేరేపితం అయ్యింది? అని గుర్తింవచ్చు. ఇందుకోసం సాధారణ పెథొలాజికల్ పరీక్షలు చేస్తారు. అంటే రక్తం, మూత్రం పరీక్షలతోపాటు ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ చేస్తారు.

### చికిత్స ఏంటి?

నొప్పి తీవ్రత, వ్యాధిగ్రస్థుల ఆరోగ్య చరిత్ర ఆధారంగా చికిత్స నిర్ణయిస్తారు. చాలామందిలో అయిదారు వారాలు మందులు వాడటం.. వ్యాయామం ఇతర సూచనలను పాటించటం వల్ల వెన్నునొప్పి తగ్గుతుంది. అయితే కొంత మందిలో మాత్రం ఉపశమనం లభించదు. అటువంటి వారికి శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఆరు నుంచి పన్నెండు వారాల తరువాత కూడా నొప్పి తీవ్రత చాలా ఎక్కువగా ఉంటే శస్త్రచికిత్స అవసరమవుతుంది. లామినెక్టమీ, మైక్రోడిసెక్టమీ శస్త్ర చికిత్సలు నొప్పినుంచి ఉపశమనం కలిగిస్తాయి.

### ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

- ఒకసారి వెన్ను నొప్పి వచ్చి చికిత్స తీసుకుని కోలుకున్న తరువాత కూర్చోవటం, పడుకోవటం, వంగి వస్తువులు అందుకోవటం, బరువులు ఎత్తటానికి సంబంధించి ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వెన్నునొప్పి రాక ముందటిలా ప్రవర్తించటం వల్ల మళ్లీ నొప్పి రావటానికే కాకుండా వెన్నుకండరాలకు, వెన్నుకు తీవ్రమైన నష్టం కలిగించే ప్రమాదం ఉంటుంది.
- వీపు ప్రాంతానికి విశ్రాంతిని ఇవ్వటం ద్వారా వెన్నునొప్పి నుంచి కొంత ఉపశమనం కలిగించవచ్చని ఇదివరలో పడుకొని ఉండాల్సిందిగా డాక్టర్లు సూచించే వారు.
- కానీ ఇప్పుడు ఒకటి రెండు రోజులకు మించి అలా పడుకుని విశ్రాంతి తీసుకోవటాన్ని ఎవరూ సిఫార్సు చేయడం లేదు కాబట్టి దీని గురించి ఆలోచించాలి.

### లక్షణాలు

- మెడ కింది భాగం నుంచి వెన్నుచివరన ఉండే టెయిల్ బోన్ దాకా వెన్ను వెంట బిగుసుకుపోవడం వల్ల భరించలేని నొప్పి వస్తుంది.
- మెడలో.. వీపు పైభాగంలో.. వీపు కింది భాగంలో చాలా నొప్పిగా ఉంటుంది. ఏదైనా బరువు ఎత్తినపుడు శ్రమతో కూడిన పనులు చేసినపుడు నొప్పి మరింత ఎక్కువవుతుంది.
- ఎక్కువ సేపు కూర్చున్నా.. నిలబడ్డా వీపు మధ్య
- కింది భాగాల్లో నొప్పి కలుగుతుంది.
- నొప్పి వీపు కింది భాగం నుంచి పిరుదులు, తొడలు, పిక్కలు, వేళ్ల వరకూ వ్యాపించి ఉంటుంది.
- నిలబడినపుడు వీపు కింది భాగంలో విపరీతమైన నొప్పి కలిగి కండరాలు గట్టిగా కదులుతాయి.
- రాత్రిళ్లు వచ్చే వెన్ను నొప్పిలో పైకి కనిపించే లక్షణాలు రోజంతా ఉండే వెన్నునొప్పిలాగానే కనిపించినా కారణం మాత్రం భిన్నమైంది. వెన్నులో కురుపు ఏర్పడటానికి ఇది సూచిక కావచ్చు.
- ఈ గడ్డ చిన్నదిగా ఉండి వెన్ను నుంచి ప్రారంభమయ్యే నాడులను ప్రేరేపిస్తుంది.
- వెన్ను పూసలలో దేనికైనా ఇన్ఫెక్షన్ సోకటం వల్ల కూడా రాత్రుళ్లలో తీవ్ర నొప్పి ఏర్పడుతుంది.



### ఈ నొప్పితో వేరే సమస్యలు

-చేతులు, కాళ్లు, గజ్జల్లో తిమ్మిర్లు ఏర్పడుతాయి. పొడిచినట్లు అనిపిస్తుంది.

-నడుము దగ్గరనుంచి ముందుకు వంగినప్పుడు, దగ్గినపుడు నొప్పి ఎక్కువ అవుతుంటుంది. దీనిని హెర్నియేటెడ్ డిస్క్ అంటారు.

-జ్వరం, మూత్ర విసర్జన సమయంలో మంట ఉండి తరచూ మూత్రానికి వెళ్ల వలసి వస్తుంది. ఇన్ఫెక్షన్ వల్ల ఇలా జరుగుతుంది.

-వెన్ను నొప్పి కాలు వెనుకభాగం మీదుగా కిందికి వ్యాపిస్తుంది. దీనిని సయాటికాగా గుర్తించాలి.



# సైనసైటిస్‌కు స్వస్తి

**వాన చినుకులకు కొందరు మురిసిపోతారు. కానీ మరికొందరు భయపడతారు. వర్షంలో తడిస్తే ఆరోగ్య సమస్యలు ఎక్కడ వస్తాయోనని వారి బాధ. చలికి.. చల్లగాలికి.. వర్షానికి అలా వేధించే సమస్యే సైనసైటిస్. చూడడానికి చిన్న సమస్యగానే కనిపించినా ఇది ప్రమాదకరమైంది. దీనినెలా గుర్తించాలి? చికిత్స ఏంటి? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? తెలుసుకొని సైనస్‌కు స్వస్తి పలుకుదాం.ఆధునిక జీవనశైలి సైనసైటిస్ సమస్యను తీవ్రతరం చేస్తున్నది. ప్రతి పదిమందిలో ఐదుగురు సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి లోపించడం కూడా దీనికి కారణం అవుతున్నది. వాతావరణంలో మార్పులు వస్తే కొందరు ఎక్కడ తమకు సైనసైటిస్ సమస్య వస్తుందేమోనని భయపడుతున్నారని చెప్తున్నారు సౌత్ కొరియాలోని యూనివర్సిటీ ఆఫ్ ఉల్సాన్ నిపుణులు. జీవనశైలి మార్చుకుంటే ఈ సమస్యను ప్రారంభంలోనే అధిగమించవచ్చు అని చెప్తున్నారు.**



సైనసైటిస్ అంటే?: కపాలంలో గాలితో నిండిన కుహరాన్ని సైనస్ అంటారు. మ్యూకస్ మెంబ్రేన్ అనే మెత్తటి పొరతో సైనస్ కప్పబడి పలుచటి ద్రవపదార్థాన్ని తయారుచేస్తుంది. ఇది మనం ఊపిరి పీల్చినప్పుడు శరీరంలోకి ప్రవేశించిన గాలికి సరైన ఉష్ణోగ్రత, తేమ కల్పిస్తుంది. కపాలంలోని ఎముకల్లో గాలి ఉండడం వల్ల వాటి బరువు తగ్గించడంలో క్రియాశీలకంగా పనిచేస్తుంది. అంతేకాదు.. మనం మాట్లాడినప్పుడు శబ్దం రావడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. కొన్నిసార్లు ఎలాంటి పొర అడ్డులేకుండా సైనస్ నేరుగా ముక్కు రంధ్రంలోకి తెరుచుకుంటుంది. ఆ సమయంలో స్రవించిన స్రావాలు వాటి మార్గంలో అడ్డుపడటం వల్ల శ్వాస సమస్యలు ఏర్పడుతాయి. దీనినే సైనసైటిస్ అంటారు.

లక్షణాలు : తలనొప్పి, ముక్కు దిబ్బడ, నీరు కారడం, దగ్గు, జలుబు సైనసైటిస్ లక్షణాలు. వాతావరణం మారినప్పుడల్లా వైరస్, బాక్టీరియా, ఇన్ఫెక్షన్ల వల్ల సైనసైటిస్ వస్తుంటుంది.

ఎన్ని రకాలు? : సింపుల్‌గా చెప్పాలంటే కళ్లు, ముక్కు, పక్కభాగం ఎముకల్లో ఉండే సన్నని గాలితో నిండిన సైనస్ భాగం ఇన్ఫెక్షన్లతో వాచిపోవడాన్ని సైనసైటిస్ అంటారు. దీనిలో ఫ్రాంటల్, పారానాసల్, ఎత్మోయిటల్, యాగ్జిలరీ, స్ఫినాయిడల్ వంటి రకాలు ఉన్నాయి. కానీ ముఖ్యంగా వీటిని మూడు రకాలుగా చెప్తారు. ఒక్కో దశలో ఒక్కో రకమైన తీవ్రతతో ఉంటుంది.

1. అక్యూట్ సైనసైటిస్
2. సబ్ అక్యూట్ సైనసైటిస్
3. క్రానిక్ సైనసైటిస్

అక్యూట్ సైనసైటిస్ వారం రోజులుంటుంది. సబ్ అక్యూట్ 4-8 వారాలుంటుంది. క్రానిక్‌ను దీర్ఘకాలిక సైనసైటిస్ అంటారు. ఇది 8-10 వారాలు బాధిస్తుంది. ఇండియాలో కన్నా అమెరికాలో సైనసైటిస్ సమస్యలు ఎక్కువ అని సర్వేలు చెప్తున్నాయి. 2.4 లక్షల మంది అమెరికన్లు సైనసైటిస్‌తో బాధపడుతున్నారట. వ్యాధిని తేలికగా తీసుకోవడమే వ్యాధి తీవ్రతకు కారణంగా చెప్పుకోవచ్చు. ఆపరేషన్ చేసినా కూడా సరైన జీవనశైలి లేకపోతే ఈ సమస్య మళ్లీ వచ్చే ప్రమాదం ఉంది.

ఎలాంటి సమస్యలు?: సైనసైటిస్ వల్ల సైనస్ భాగంలో తీవ్రమైన ఒత్తిడి, నొప్పి కలుగుతాయి. చీముతో కూడిన స్రావాలు ముక్కు నుంచి బయటకు వస్తాయి. ముక్కు దిబ్బడగా ఉంటుంది. ముక్కులో ఇన్ఫెక్షన్లు మొదలవుతాయి. కొన్నిసార్లు సూక్ష్మజీవులు ఎక్కువగా ఉన్న నీళ్లలో ఈత కొట్టడం వల్ల అవి సైనస్‌లోకి ప్రవేశించి వ్యాధిని కలిగిస్తాయి. స్విమ్మింగ్ పూల్స్‌లో క్లోరిన్ ఎక్కువగా ఉంటే కూడా ఆ గాలి ముక్కు రంధ్రాల ద్వారా సైనస్‌లోకి చేరి మ్యూకస్ మెంబ్రేన్ వాచిపోతుంది. దంతాలలో వచ్చే ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా సైనస్ సమస్యలు వస్తాయి. దీర్ఘకాలికంగా సైనసైటిస్ వ్యాధితో బాధపడే వారు కనురెప్పల వాపు, కనుగుడ్లు పక్కకు జరిగి ఉండటం, కన్ను నరం దెబ్బతిన్నపుడు చూపు కోల్పోవడం, వాసన తెలియక పోవడం, తరచూ జ్వరం రావడం, ఎదుగుదల లోపాలు వంటి సమస్యలు వస్తాయి.

ఇతర సమస్యలూ కారణమే: వేరే ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే వాటి వల్ల కూడా సైనసైటిస్ సోకుతుంది. పుష్టికరమైన ఆహారం తీసుకోకపోవడం, చికెన్ పాక్స్, కోరింత దగ్గు, డయాబెటీస్ సమస్యలు ఉన్నట్లయితే సైనసైటిస్ వస్తుంది. చాలా కేసుల్లో సైనసైటిస్ వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. తర్వాత బాక్టీరియా చేరి సైనస్ సమస్యగా మారుతుంది. ఈ హానికర సూక్ష్మజీవుల్లో స్ట్రెప్టోకోకస్ న్యుమోనియా, హీమోఫిలస్ ఇన్‌ఫ్లూయెంజా, స్టెఫైలోకోకస్ ఆర్‌ఈయస్ వంటి వాటివల్ల కూడా సైనసైటిస్ సమస్య వస్తుంది. మ్యూకోసల్ మెంబ్రేన్, సైనస్ ఎముకల మీద కూడా ప్రభావం వల్ల.. దంతాలకు ఉన్న అంటు సైనస్‌లకు వ్యాపించడం వల్ల సైనసైటిస్ సమస్య వస్తుంది.

వ్యాధి నిర్ధారణ: ముఖం భారంగా ఉండటం, తలనొప్పి, గొంతులోకి ద్రవం కారటం, చెవిలో చీము పట్టడం, కోపం, మానసిక స్థైర్యం కోల్పోవటం, అలసట, విసుగు, పనిపై శ్రద్ధ లేకపోవటం వంటి లక్షణాలు వరుస క్రమంలో ఉంటే సైనసైటిస్‌గా గుర్తించాలి. దీనిని సీటీ స్కానింగ్, ఎక్స్‌రే ద్వారా నిర్ధారిస్తారు.

కారణమేంటి?

సైనస్‌లో సరైన వెంటిలేషన్ లేకపోవడం ముఖ్య కారణం. సాధారణంగా సైనస్‌లో మ్యూకస్ ద్రవాలు సీలియరీ మూమెంట్ వల్ల ఆస్టియాను చేరి అక్కడ నుంచి ముక్కు రంధ్రాల్లోకి చేరుతాయి. ఇది జరుగకుండా సైనస్‌లో తయారయ్యే పదార్థాలు నిల్వ ఉండి విధులకు ఆటంకం కలిగిస్తాయి. ముఖ్యంగా నాసికా కవచం, స్ఫుటం నిర్మాణంలో తేడాలు ఏర్పడతాయి. కొందరికి ముక్కులోని ద్రవాల చిక్కదనం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఒకసారి సైనసైటిస్ వచ్చి మ్యూకోసా దెబ్బతింటే పదే పదే వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాతావరణం తేమగా, చల్లగా ఉన్నప్పుడు వాటి ప్రభావం వల్ల సైనసైటిస్ వస్తుంది.

చికిత్స:

అమాక్సిసిల్లిన్ లేదా ఆంపిసిల్లీన్ మందులు ఇవ్వవచ్చు. ఓరల్ డ్రిక్సోరాల్, డిమెటాప్ మందులతో కూడా తగ్గుతుంది. స్టీమ్‌ను పీల్చుకొనుట ద్వారా హీట్‌ను కలిగించుట ద్వారా ముక్కు నుంచి స్రావాలు బయటకు రప్పించి ఉపశమనం కలిగించవచ్చు. నాసల్ స్ప్రేలు కొంతవరకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. మందులకు తగ్గకపోతే మాత్రం శస్త్రచికిత్స ద్వారా సైనస్‌కు కారణమైన దుర్మాంసాన్ని తొలగించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

-ఎలర్జీ కలిగించే వస్తువులను దూరంగా ఉంచాలి.


-తగిన పోషకాహారం తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవాలి.

-శ్వాసకోశ అంటువ్యాధులతో బాధపడుతూ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి.

-శ్వాసకోశ వెలుపలి భాగాల్లో అంటు 7- 10 రోజుల కంటే ఎక్కువ ఉండకుండా చూసుకోవాలి.

-ముక్కు నుండి వచ్చే స్రావాల రంగు మారినా లేదా చెడు వాసన వస్తున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.

-టాన్సిలైటిస్‌తో బాదపడుతున్నవారు వెంటనే ఈఎన్‌టీ నిపుణులను సంప్రదించాలి.



# లస్ట్ స్టోరీస్ నికిత బాస్ లేడీ వైబ్స్ వైరల్



లస్ట్ స్టోరీస్ అనగానే కియరా అద్వాణీ, తమన్నా లాంటి అగ్ర నటీమణులే కాదు, నిఖిత దత్తా లాంటి నేటితరం ట్రెండీ నటిని కూడా అభిమానులు వెంటనే గుర్తు పట్టేస్తారు. లస్ట్ స్టోరీస్క, బీర్ సింగ్, ది బిగ్ బుల్, గోల్డ్ వంటి చిత్రాలలో నటించింది నికితా దత్తా నటిగా తనని తాన నిరూపించుకుంది. ఈ భామ అందచందాలు నటనకు ప్రత్యేకించి ఫాలోయింగ్ ఏర్పడింది. సోషల్ మీడియా క్వీన్ గాను నిఖితకు భారీ అనుచరులున్నారు. బికినీలు స్విమ్ సూట్లతో దుమ్ము దుతిపేయడం నికిత ప్రత్యేకత. ఇప్పటికే తన సోషల్ మీడియాల్లో ఇలాంటి ఫోటోలకు కొదవేమీ లేదు. షర్ట్ బటన్ తీసేసి.. ఓర చూపులతో తెలుగమ్మాయి నికితా లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు అభిమానుల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈసారి మునుపటి కంటే డిఫరెంట్ లుక్, ట్రెండీ బ్యాక్ డ్రాప్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. నికిత బ్లేజర్ లో బాస్ లుక్ వైబ్స్ తో మెరిపించింది. నిఖిత హాట్ ఫోటోషూట్ ప్రస్తుతం వెబ్ ని షేక్ చేస్తోంది. ఈ ఫోటోలను చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. హాట్‌నెస్ ఓవర్ లోడెడ్ అని ఒక అభిమాని వ్యాఖ్యానించగా.. ఫైర్ ఈమోజీలను కొందరు షేర్ చేసారు.

అందాల విందులో హద్దులు చెరిపేసిన జూ.ఐశ్వర్యరాయ్ కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నిఖిత చివరిగా రాకెట్ గ్యాంగ్ చిత్రంలో తానియాగా కనిపించింది. మ్యూజికల్ సూపర్‌నేచురల్ కామెడీ డ్రామా చిత్రమిది. ఈ చిత్రంలో అమర్‌బీర్‌గా ఆదిత్య సీల్- జాసన్ థామ్ నటించారు. ఈ చిత్రంలో రణబీర్ కపూర్ హర్ బచ్చా హై రాకెట్ పాటలో ప్రత్యేక పాత్రలో (ఏంజెల్‌గా) కనిపించాడు. నీరజ్ పాండే రూపొందించిన ఖాకీ: ది బీహార్ చాప్టర్ వెబ్ సిరీస్‌లో కూడా నికితా కనిపించింది. ఇందులో కరణ్ టాకర్ (ఐపీఎస్ అమిత్ లోధాగా) ప్రధాన పాత్రలో నటించారు. క్రైమ్ థ్రిల్లర్ సిరీస్‌లో నిఖిత అమిత్ భార్య తనూ లోధా పాత్రను పోషించింది.

# స్పైసీ లుక్‌లో రకుల్ జిగేల్



టాలీవుడ్ మోస్ట్ బ్యూటిఫుల్ హీరోయిన్ లలో రకుల్ ప్రీత్ సింగ్ ఒకరు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు చాలా ముద్దుగా ఉన్న రకుల్ ఆ తర్వాత జిమ్, వర్కౌట్స్, ఫిట్నెస్ మీద ఫోకస్ పెట్టి చాలా సన్నపడింది. అలా సన్నపడిన తర్వాత ఒకప్పటి రకుల్ ని మిస్ అయ్యాం అని చాలా మంది ఫీలయ్యారు. అయితే, ఇప్పుడు మళ్లీ పాత రకుల్ ని చూసిన ఫీల్ కలిగింది. రకుల్ తన అందంతో అభిమాను లను మెస్మరైజ్ చేయడంలో ఎప్పుడూ ముందుంటుంది. సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. తాజాగా రెండు కలర్ ప్రింటెడ్ ఫ్రాక్ ధరించింది. ఆ డ్రెస్ లో రకుల్ రెడ్ కలర్ లాగే హాట్ గా స్పైసీగా కనపడు తోంది. అయితే, ఈ ఫోటోల్లో రకుల్ చాలా అందంగా కనపడుతున్నారు. ఆ మధ్య మరీ సన్నపడినా, ఇప్పుడు పాతరకుల్ చూసిన అనుభూతి కలుగుతోంది. స్వయంభు.. ఎవరీ సుందరి.. ఎంతందమైన శిల్పం? అందుకే, ఆమె అందం రెట్టింపు అయినట్లు అనిపిస్తోంది. ఈ ఫోటోల్లో తన ఎద అందాలు కనిపించేలా ఆమె ఫోటోలకు ఫోజులు ఇవ్వడం విశేషం.

ఫోటోలు చాలా హాట్ గా ఉన్నాయని, క్రేజీగా ఉన్నాయని, వావ్ అంటూ ఎక్కువ మంది కామెంట్స్ చేస్తుండటం విశేషం. కాగా, రకుల్ కెరటం సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆ తర్వాత వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో హిట్ కొట్టింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసింది లేదు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలు అందరితోనూ ఆడిపాడింది. స్టార్ హీరోలందరితోనూ ఆడిపడిన ఆమె ఆ తర్వాత బాలీవుడ్ కి షిఫ్ట్ అయిపోయింది. సైరా తరువాత.. మళ్ళీ ఇప్పుడిలా.. అక్కడ, ఆమెకు వెంట వెంటనే చాలా సినిమాల్లో ఆఫర్లు వచ్చాయి.
అవి కనుక హిట్ అయ్యి ఉండిఉంట, బాలీవుడ్ లో పాతుకుపోయేది. కానీ, ఆమె నటించిన ఏ సినిమా బాలీవుడ్ లో సక్సెస్ కాలేకపోయింది. దాదాపు ఐదు సినిమాల్లో నటించినా, అన్నీ ఫ్లాప్ టాక్ తెచ్చుకున్నాయి. దీంతో, గోడకు కొట్టిన బంతిలా మళ్లీ దక్షిణాదిన ఆఫర్ల కోసం ప్రయత్నాలు మొదల్నుపెట్టింది. తెలుగులో అయితే, ఎలాంటి ఆఫర్లు లేవు కానీ, తమిళం నుంచి ఆఫర్లు వస్తున్నట్లు తెలుస్తోంది.

# స్వయంభు.. ఎవరీ సుందరి.. ఎంతందమైన శిల్పం?



ట్యాలెంటెడ్ హీరో నిఖిల్ ఇటీవలే తన కెరీర్ ల్యాండ్‌మార్క్ (20వ) సినిమా 'స్వయంభు' కోసం మార్షల్ ఆర్ట్స్ లో కఠోర శిక్షణ కోసం వియత్నాం వెళ్లాడు. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకుడు కాగా, ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను భువన్ - శ్రీకర్ నిర్మించనున్నారు. నిఖిల్ లెజెండరీ యోధుడి పాత్రలో నటించేందుకు ఆయుధ పోరాటం, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నాడు. నమ్మశక్యం కాని వార్ సీక్వెన్సులతో అలరించే ఈ సినిమాలో అతడు కొన్ని అసాధారణ స్టంట్స్ లో కనిపించనున్నాడు. సైరా తరువాత.. మళ్ళీ ఇప్పుడిలా.. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం.. ప్రతిభతో మెరిసిపోయే అందం, బ్యాక్ టు బ్యాక్ బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్న సంయుక్త మీనన్ ఇందులో కథానాయికగా నటిస్తోందని తెలిసింది. ఈరోజు సంయుక్త పుట్టినరోజు సందర్భంగా ఆకర్షణీయమైన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఒక పెద్ద కోట ముందు, భారీ ఆభరణాలతో కూడిన యువరాణి శిల్పంలా సంయుక్త రూపం ఆకట్టుకుంటోంది. అక్కడ ఉన్న అందమైన శిల్పం సంయుక్త చేతిపై ఒక పక్షి వాలి ఉంది. అది తన ప్రియుడి నుంచి ఎలాంటి కబురందించిందో సినిమాలోనే చూడాలి. సారీ చెప్పిన ఏ.ఆర్.రెహమాన్.. అసలేమైంది? స్వయంభూ టాలీవుడ్ లో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న భారీ చిత్రం. రవి బస్రూర్ సంగీతం అందించనుండగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాహరన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి వాసుదేవ్ మునెప్పగారి డైలాగ్స్ అందించారు. ఫిజికల్ మేకోవర్‌లో ఉన్న నిఖిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో లెజెండరీ యోధుడిగా అద్భుతంగా కనిపించాడు. కార్తికేయ 2 తో బ్లాక్ బస్టర్ అందుకున్న నిఖిల్ మాంచి జోష్ తో వరుస సినిమాల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే.



వ్యక్తిగత జీవితంలోని అన్ని ఎమోషన్స్ ని ఫేస్ చేసి చివరికి కరెక్షన్ మోడ్ లో ఉంది శ్రుతిహాసన్. తొలుత విదేశీ ప్రియుడు మైఖేల్ తో ప్రేమలో భంగపాటు, అనంతరం డూడుల్ ఆర్టిస్టు శంతను హజారికాతో స్నేహం వగైరా వ్యవహారాలు తెలిసినవే. ప్రస్తుతం శంతను చెంతనే ఉంటే శ్రుతి అన్నిటినీ మరిచి ఎంతో హాయిని ఆస్వాధిస్తోంది. ఇక తమ మధ్య అభిరుచులు కలిసాయి గనుకే ఈ స్నేహం ఇలా ఎప్పటికీ అనంతంగా కొనసాగుతుందంటూ శ్రుతి ఇంతకుముందే ధృవీకరించింది. ఇక శ్రుతిహాసన్ వ్యక్తిగత ఫ్యాషన్ ఎంపికల్లో డార్క్ థీమ్ కి ఎప్పుడూ శంతను కూడా సపోర్ట్ గానే ఉన్నాడు. ఎంపిక చేసుకునే దుస్తులు, మేకప్, నెయిల్ పాలిష్ ఇంకా ఏదైనా అది పూర్తిగా డార్క్ టోన్ తో ఆశ్చర్యపరిచేవే. షర్ట్ బటన్ తీసేసి.. ఓర చూపులతో తెలుగమ్మాయి తన ఎంపికలు తన మనసును ఆవిష్కరిస్తున్నాయి. శ్రుతి ఇప్పుడు కూడా మరోసారి డార్క్ థీమ్ తో ఆశ్చర్యపరిచింది. డార్క్ బ్లాక్ ఇన్నర్.. దానిపై డార్క్ కలర్ మెస్సీ డిజైనర్ కోట్ శ్రుతి లుక్ ని హాట్ గా మార్చేశాయనడంలో సందేహం లేదు. ఇక చేతి వేళ్లకు నెయిల్ పాలిష్ మొదలు చేతికి గాజులు, చెవులకు లోలాకులు, వేలికి ఉంగరాలు ఇలా ప్రతిదీ బ్లాక్ థీమ్ తో ఎంతో డిఫరెంట్ గా కనిపించాయి. ప్రస్తుతం ఈ డిఫరెంట్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. శ్రుతి హాసన్ తదుపరి ఇండియాస్ బిగ్గెస్ట్ పాన్ ఇండియా మూవీ సలార్ లో కనిపించనుంది. ప్రభాస్ సరసన శ్రుతి తొలిసారి కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి కేజీఎఫ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. హెూంబలే ఫిలింస్ దాదాపు 400 కోట్ల బడ్జెట్ తో రూపొందిస్తోందని కథనాలు వచ్చాయి.

# డార్క్ థీమ్‌పై శ్రుతిహాసన్‌కి ఎందుకంత మోజు?